www.visalaandhra.com

శుక్రవారం
18-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 206
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇమ్రాన్ జైల్లో సెలవులు ఆస్వాదిస్తున్నారు

ఇస్లామాబాద్:
వివిధ కేసుల్లో జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైలు శిక్ష అనుభవించడం కంటే... సెలవులు ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తున్నారని పాక్ సమాచారశాఖ మంత్రి అతావుల్లా తరార్ వ్యాఖ్యానించారు. కారాగారంలో తనపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారంటూ ఇమ్రాన్ అనేక సందర్భాల్లో చేసిన ఆరోపణలు తరార్ కొట్టిపారేశారు. మరే ఇతర రాజకీయ నేతకు దక్కని ప్రత్యేక హక్కులు ఇమ్రాన్‌కు లభించాయని, వారంలో అనేకమంది ఆయన్ను సందర్శిస్తుంటారన్నారు. కారాగారంలో విస్తృత సౌకర్యాలు పొందుతున్నారని చెప్పారు.

వక్ఫ్ నోటిపై చేయొద్దు

- వక్ఫ్ ఆస్తులపై సుప్రీం స్పష్టీకరణ
- బోర్డు-కౌన్సిళ్లలో నియామకాలు వద్దు
- స్టేటస్ కో పాటించాలని ఆదేశం
- కేంద్రానికి వారం గడువు
- తదుపరి విచారణ మే 5కు వాయిదా

న్యూఢిల్లీ:
వక్ఫ్ ఆస్తులపై స్టేటస్ కో విధిస్తూ... వక్ఫ్ బోర్డులు, కౌన్సిళ్లలో నియామకాలకు అనుమతి నిరాకరిస్తూ సుప్రీం కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వక్ఫ్ సవరణ చట్టం-2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై విచారణ రెండో రోజు జరిగింది. ఈ పిటిషన్లపై స్పందించేందుకు వారం రోజులు కావాలని కేంద్రప్రభుత్వం కోరగా... అందుకు సర్వోన్నత న్యాయస్థానం

- మిగతా 2 లో

పెట్టుబడుల వేట

- జపాన్ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ
- 'మారుబెనీ'తో రూ.వెయ్యి కోట్ల ఒప్పందం
- లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై ప్రతినిధుల సంతకాలు
- 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు
- సోనీ యానిమేషన్ అనుబంధ సంస్థతో చర్చలు

విశాలాంధ్ర - హైదరాబాద్:
పెట్టుబడుల సాధనే లక్ష్యంగా జపాన్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం పెట్టుబడులను ఆకర్షించడంలో సఫలీకృతం అయింది. తొలి రోజు గురువారం కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ సంస్థ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ముందుకొచ్చింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులను ముఖ్యమంత్రి బృందం కలిసింది. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. సుమారు రూ.వెయ్యికోట్ల పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ ప్లాంట్లను

- మిగతా 2 లో

'మెట్రో'కు రూ.11,693 కోట్ల రుణం 2 లో

రూ.793 కోట్ల దాల్మియా ఆస్తులు జప్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల అభియోగాల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. భారతి సిమెంట్స్ కార్పొరేషన్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పునీత్ దాల్మియా కంపెనీలకు చెందిన రూ.793 కోట్ల ఆస్తులు జప్తు చేస్తున్నట్లు ఈడీ వెల్లడించింది. ఆ ఆస్తుల్లో దాదాపు రూ.377 కోట్ల విలువైన భూమి భారతి సిమెంట్స్‌లో క్విడ్ ప్రోకో జరిగిందన్న విషయాన్ని ఈడీ గుర్తించింది. కడప జిల్లాలో అక్రమంగా సున్నపురాయి

- మిగతా 2 లో

మిథున్‌రెడ్డికి హైకోర్టు షాక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. మద్యం కుంభకోణం కేసుపై విచారణలో భాగంగా ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న ఆయన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. మిథున్ రెడ్డిని న్యాయవాదుల సమక్షంలో విచారించాలని సిట్‌ను ఆదేశించింది. విచారణకు ఆటంకం కలిగించవద్దని స్పష్టంచేసింది. కార్యాలయంలోని సీసీటీవీలో కనిపించేలా విచారణ జరగాలని అధికారులకు సూచిస్తూ...విచారణ ఆడియో, వీడియోల రికార్డునకు

- మిగతా 2 లో

గ్రూప్-1 అభ్యర్థులకు చుక్కెదురు

విశాలాంధ్ర-హైదరాబాద్:
గ్రూప్-1 నియామక ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని తెలిపింది. అయితే విచారణ పూర్తయ్యే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని టీజీపీఎస్సీని ఆదేశించింది. ఇటీవల వెల్లడించిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్‌ను సవాల్ చేస్తూ 20 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. జీఆర్ఎల్‌లో అవకతవకలు

- మిగతా 2 లో

ఏఐకేఎస్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్షీరసాగర్, రావుల వెంకయ్య

జాతీయ కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్

రాజన్ క్షీరసాగర్ | రావుల వెంకయ్య | కేవీవీ ప్రసాద్ | ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య తిరిగి ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా జి.ఈశ్వరయ్య, సమితి సభ్యులుగా ఎ.కాటమయ్య, పి.జమల య్య, కె.జగన్నాథం, ఎ.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడు, కె.వీరారెడ్డి, పి.గంగాభవానీ, ఆహ్వానితుడిగా వి.రామచంద్రయ్య ఎన్నికయ్యారు. తమిళనాడులోని నాగపట్టణంలో ఈనెల 15 నుంచి గురువారం వరకు ఏఐకేఎస్ 30వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 650 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 57 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలను జయప్రదం చేయటంలో తమిళనాడు రాష్ట్ర కిసాన్ సభ విశేష కృషి చేసింది. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేసింది. ఈ జాతీయ మహాసభలో 115 మందితో జాతీయ కౌన్సిల్, 39 మందితో కార్యవర్గం,17మంది ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు.

ఏఐకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా 'బాగం'

బాగం హేమంతరావు

విశాలాంధ్ర- ఖమ్మం: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం ముటాపురంలో రైతు కుటుంబంలో జన్మించిన హేమంతరావు విద్యార్థి దశ నుంచి వామపక్ష ఉద్యమంలో పనిచేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన హేమంతరావు ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు.

హేమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ పరిరక్షణే లక్ష్యంగా ఏఐకేఎస్ అధ్వర్యంలో రైతాంగ ఉద్యమాలు నిర్మించనున్నట్లు తెలిపారు. పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. జాతీయ కౌన్సిల్ సభ్యులుగా... ఏఐకేఎస్ ఖమ్మంజిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, మందడపు రాణి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఎన్నికయ్యారు.

450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పుప్పాలగూడలో ఏర్పాటుపై మంత్రుల సబ్ కమిటీ నిర్ణయం

విశాలాంధ్ర - హైదరాబాద్:
పుప్పాలగూడ పరిసరాల్లో మొదటి దశలో సుమారు 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ సచివాలయంలో సీఎస్ శాంతి కుమారి, పరిశ్రమలు, రెవెన్యూ శాఖ కీలక అధికారులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించింది. వీరితోపాటు రెవిన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ సొసైటీ తదితంలకు సుమారు 200 ఎకరాల పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు సబ్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూమికి పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాలు ఉన్నట్లు అధికారులకు వివరించారు. మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు

- మిగతా 2 లో

ప్రభుత్వాన్ని నిలదీస్తే ఈడీ కేసులా?

- ట్రంప్ నిర్ణయాలపై మోదీ ఎందుకు మాట్లాడం లేదు
- కాంగ్రెస్ నేతల ప్రశ్న
- ఈడీ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర - హైదరాబాద్:
గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీని ఓడించేందుకు వస్తున్నామని పార్లమెంటులో రాహుల్ గాంధీ నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెప్పారని... అప్పటి నుండే అక్రమ కేసుల్లో నోటీసులు ఇస్తూ మోదీ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. నేడు దేశంలో ఓ ఆందోళనకర పరిస్థితి నెలకొందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి జరుగుతుందో లేదోననే భయం అందరిలో కలుగుతోందని తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జ్ షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ... గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట టీపీసీసీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా... మీనాక్షి నటరాజన్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. పేదల పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసినవారిపై ఈడీ కేసులు, విచారణ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిందని అలాగే ఇదే దేశం మొత్తం జరగాలని రాహుల్ గాంధీ కోరుతున్నారన్నారు. పోరాటం చేయడమే ప్రస్తుతం మన ముందున్న మొదటి లక్ష్యమని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసలు పైసల లావాదేవీలే జరుగనప్పుడు మనీ లాండరింగ్ ఎలా జరుగుతుందని వారు నిలదీశారు. ట్రంప్ సుంకాల బాదుడు పై మోదీ ఎందుకు మాట్లాడం లేదో చెప్పాలన్నారు. మోదీకి ట్రంప్ స్నేహితుడైనప్పుడు... ఆయన నిర్ణయాలతో దేశానికి నష్టం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేసే వరకు మన పోరాటం కొనసాగించాలన్నారు. ఏఐసీసీ ప్లీనరీలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో తీసుకున్న నిర్ణయాలను చూసి బీజేపీ, ప్రధాని మోదీ భయపడుతున్నారన్నారు. తొలుత నగరంలో మోతె రోహిత్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుండి భారీ ర్యాలీ నిర్వహించి ఈడీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి

- మిగతా 2 లో

రాష్ట్రపతిని నిర్దేశించలేరు

సుప్రీం తీర్పుపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు

భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి గడువు నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు.

2 లో

'హెచ్‌సీయూ' పై కేంద్రం నోరు మెదపదేం? కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్:
హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో వేలాది చెట్లను నరికేశారని, అక్కడ ఉన్న జంతువులకు నిలువ నీడ లేకుండా చేశారని, అతిపెద్ద ఆర్థిక మోసం జరిగిందని సెంట్రల్ ఎంపవర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల్లో అర్ధరాత్రి బుల్డోజర్లను పంపి కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం చేసిందన్నారు. ప్రవచనాలు చెప్పిన మోదీ... రాజ్యాంగాన్ని, చట్టాలను అపహాస్యం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడడానికి ఎందుకు ఆరాటపడుతున్నారని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదంటే కేంద్ర సంస్థలతో రేవంత్ ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆనాడు సీబీఐని కాంగ్రెస్ దుర్వినియోగం చేస్తే ఈనాడు ఈడీని బీజేపీ విచ్చలవిడిగా వాడుతోందని విమర్శించారు. ఈ దేశంలో ఫిరాయింపుల సంస్కృతిని తీసుకువచ్చిందే ఇందిరా గాంధీ అన్న కేటీఆర్... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన, ఎజెండా తమకు ఎంత మాత్రం లేదన్నారు. రేవంత్ రెడ్డి చేస్తున్న పనులతో ప్రజల్లోనే తిరుగుబాటు వస్తుందన్నారు. రేవంత్ ప్రైవేటు సైన్యం లాగా పనిచేస్తున్న కొంతమంది పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. రోహిత్ వేముల ఆత్మహత్య

- మిగతా 2 లో

కశ్మీర్ మాదే: పాక్

ఇస్లామాబాద్:
కశ్మీర్ అంశంపై పాకిస్థాన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఇస్లామాబాద్‌కు కశ్మీర్ 'గొంతుకు వెళ్లే రక్తనాళం' వంటిదని పాక్ సైన్యాధిపతి అసీమ్ మునీర్ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌ను పాకిస్థాన్ ఎప్పటికీ మర్చిపోదని, కశ్మీరీలను ఒంటరిగా వదిలిపెట్టబోమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రవాస పాకిస్థానీయుల సమావేశంలో పాల్గొన్న మునీర్... 'ప్రతి విషయంలో మనం హిందువులకంటే విభిన్నమైనవారిమని మన పూర్వీకులు నమ్మారు. మన మతం విభిన్నం. మన ఆచారాలు, సంస్కృతులు, ఆలోచనలు, ఆశయాలు పూర్తిగా భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనం రెండు విభిన్న దేశాలు, ఒకటి కాదు అని నమ్మారు కాబట్టే ఈ సిద్ధాంతం పుట్టింది. అందుకే పాకిస్థాన్ చరిత్రను మరిపోవద్దని మీ పిల్లలకు కచ్చితంగా చెప్పాలి. ఈ దేశాన్ని ఏర్పాటు చేయడానికి మన పూర్వీకులు చాలా త్యాగాలు చేశారు. మనం కూడా చేశాం. ఈ దేశ చరిత్రను మరిచిపోవద్దని ప్రతిఒక్కరినీ

- మిగతా 2 లో



ఖాళీచేసి పొండి: భారత్

న్యూఢిల్లీ:
కశ్మీర్ గురించి పాకిస్థాన్ సైన్యాధిపతి చేసిన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వం గట్టిగా బదులిచ్చింది. చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భూభాగాన్ని ఖాళీ చేయడమే కశ్మీర్‌తో దాయాదికి ఉన్న సంబంధమని, వెంటనే కశ్మీర్‌ను వీడి వెళ్లాలని స్పష్టం చేసింది. 'విదేశీ భూభాగం జీవనాడి ఎలా అవుతుంది? కశ్మీర్ భారత భూభాగం' అని తేల్చిచెప్పింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. 'ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా పాకిస్థాన్ గడించిన ఖ్యాతి... ఆ దేశం ఎంత ప్రయత్నించినా పోదు. ఉగ్రదాడులకు పాల్పడినవారిని ఆ దేశం ఇప్పటికీ కాపాడుతోంది. ముంబై ఉగ్రదాడుల కుట్రదారు తహవ్వుర్ రాణా అప్పగింత ఆ విషయాన్ని పాక్‌కు గుర్తుచేస్తుంది' అని అని జైస్వాల్ అన్నారు. అలాగే బెల్జియం భారత్ అప్పగింత అభ్యర్థన మేరకు ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీ అరెస్టయ్యాడన్నారు. అతడిని భారత్‌కు తీసుకొచ్చే విషయంలో బెల్జియం ప్రభుత్వంతో కలిసిపనిచేస్తున్నామని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అవునమ్మాయ్, మా మాంగారికి, మా ఆయనకి ,మా పిల్లాడికి.. ముగ్గురికీ చాన్నాళ్ల నుంచీ ఉపాధి లేదు!

15 ఏళ్ల తర్వాత బంగ్లా-పాక్ విదేశాంగ కార్యదర్శుల భేటీ

ఢాకా/ ఇస్లామాబాద్: బంగ్లాదేశ్, పాకిస్థాన్ విదేశాంగ శాఖల కార్యదర్శుల స్థాయి సమావేశాలు 15 ఏళ్లలో మొదటిసారి జరిగాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని పద్మ అతిథి గృహంలో ఆమ్నా బలోచ్ (పాక్), మహమ్మద్ జాషీముద్దీన్ (బంగ్లాదేశ్) గురువారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఈనెల 27-28 తేదీల్లో ఢాకాలో పర్యటించనుండటంతో విదేశాంగ కార్యాలయాల సంప్రదింపులు (ఎఫ్ఓసీ) జరిగాయి. పాక్ విదేశాంగ మంత్రి బంగ్లాదేశ్‌లో అధికారికంగా పర్యటించడం 2012 తర్వాత ఇదే మొదటిసారి. షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత పాకిస్థాన్‌తో సంబంధాలు చక్కబెట్టుకోవడం బంగ్లాదేశ్ దృష్టి పెట్టడం విదితమే.

గాజా దయనీయం

- ఇజ్రాయిల్ తాజా దాడుల్లో 23 మంది మృతి
- వీరిలో ఐదుగురు చిన్నారులు సహా 10 మంది కుటుంబీకులు
- వస్తు సరఫరాపై ఆంక్షలతో మిన్నంటిన ఆకలి కేకలు: ఐరాస

గాజాస్ట్రిప్: గాజాలో ఇజ్రాయిల్ భీకర పోరు సాగిస్తూ తాజా దాడుల్లో 23 మంది పలస్తీనియన్ల ప్రాణాలు హరించింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నట్లు గాజా ఆరోగ్య అధికారులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఇజ్రాయిల్ దళాలు వైమానిక, భూతల దాడులతో ఖాన్ యూనిస్‌ను దద్దరిల్లించాయి. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలు, నలుగురు మహిళలు, ఓ పురుషుడు (10 మంది) ప్రాణాలు కోల్పోయారు. తీవ్రమైన కాలిన గాయాలతో ఉన్న వీరి మృతదేహాలు నాసర్ ఆసుపత్రికి చేరాయి' అని అధికారులు వెల్లడించారు. ఉత్తర గాజాలో జరిగిన దాడుల్లో 13 మంది చనిపోగా, వీరిలో తొమ్మిది మంది చిన్నారులు ఉన్నట్లు ఇండోనేషియన్ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. అయితే పౌర మరణాలను నివారించేందుకు తమ వంతు కృషి చేస్తుండగా, నివాస ప్రాంతాల నుంచి పనిచేస్తున్న హమాస్ ఈ మరణాలకు బాధ్యత వహించాలని ఇజ్రాయిల్ సైన్యం నెపం నెట్టేసింది. తమ బాధ్యత లేదని ప్రకటించింది. ఇదిలావుంటే, ఆహారం, నిత్యావసరాల సరఫరాను ఇజ్రాయిల్ నిలిపివేయడంతో గాజాలో ఆకలి కేకలు తీవ్రమవుతున్నట్లు ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తంచేసింది. గాజాలో 20 లక్షల మందికిపైగా క్షుద్బాధను అనుభవిస్తున్నారని, ఛారిటీ కిచెన్ ద్వారా 10 లక్షల మంది కోసం భోజనం తయారవుంటే, దానిపైనే 20 లక్షల మంది ఆధారపడే దయనీయ పరిస్థితి నెలకొందని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యాలయం (ఓసీహెచ్ఏ) వెల్లడించింది. సరుకుల కొరత, నిల్వలు లేక చాలా ఆహార పంపిణీ కార్యక్రమాలు నిలిచిపోయినట్లు తెలిపింది. ఆహారం కోసం మార్కెట్లకు వెళ్లి కొనాలంటే మండిపోతున్న ధరలు అడ్డొస్తున్నాయని, దీంతో జనాభాలో 80శాతం మంది మానవతా సాయాన్నే నమ్ముకున్నారని పేర్కొంది. గాజా స్ట్రిప్‌లో మానవతా పరిస్థితులు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయని ఐక్యరాజ్య సమితి ఆవేదన వ్యక్తం చేసింది.

చైనా, కంబోడియా పటిష్ట బంధం: జిన్‌పింగ్

ఫునోమ్ పెన్: ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాగానీ చైనా-కంబోడియా బంధం పటిష్టంగా నిలిచిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. అంతర్జాతీయ పరిణామాలు, మారుతున్న సమయాల్లో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ చైనా-కంబోడియా మధ్య తమ పూర్వీకులు ఏర్పాటు చేసిన ద్వైపాక్షిక బంధం మరింత బలంగా నిలిచిందని తెలిపారు.జిన్‌పింగ్ గురువారం కంబోడియాలో అధికారికంగా పర్యటించారు. సౌతీస్ట్ ఏషియా పర్యటనలో భాగంగా ఆయన వియత్నాం, మలేసియాలో పర్యటించారు. ట్రంప్ ప్రభుత్వం సుంకాలతో విరుచుకుపడుతుండటంతో మిగతా దేశాలతో తమ బంధాన్ని పటిష్టం చేసుకోవాలని జిన్‌పింగ్ సంకల్పించారు. ఇదే క్రమంలో ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలను పెంచుకునే పనిలో పడ్డారు. కొందరు అధినేతలకు చైనాలో అతిథ్యం కల్పిస్తూ... మరికొన్ని దేశాల ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ తమ బలాన్ని పెంచుకొనే దిశగా జిన్‌పింగ్ ముందుకెళుతున్నారు. కంబోడియా రాజధాని ఫునోమ్ పెన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం లభించింది. అక్కడ నుంచి నేరుగా కంబోడియా రాయల్ ప్యాలెస్‌కు వెళ్లిన ఆయన కోసం ఎర్ర తివాచీ పరిచారు. కంబోడియా రాజు నోరోడోమ్ షిహామోనీ ఆయనను సాదరంగా ఆహ్వానించారు. తమ దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇద్దరు నాయకులు నిర్ణయించారు. బెల్ట్ అండ్ రోడ్‌తో వ్యూహాత్మక బంధం, నూతన అభివృద్ధి అవకాశాల కల్పనకు ప్రణాళికలపై చర్చించారు. 31 సహకార అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని పెంచుకోవాలని, పెట్టుబడులతో సహకరించుకోవాలని పరస్పరం నిర్ణయించారు. మరోవైపు అమెరికా ప్రతీకార చర్యలను చైనా ఆక్షేపించింది. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్ నంబర్ గేమ్ ఆడుతోందని, తమను బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక అమెరికా పెంచే సుంకాలను పట్టించుకోమని చైనా విదేశాంగ శాఖ ప్రకటించింది. తమ దేశంపై ప్రతీకార సుంకాలను 245 శాతానికి పెంచేయడానికి ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తమ స్థాయిలో చైనా పెంచింది.

'మెట్రో'కు రూ.11,693 కోట్ల రుణం

'జైకా'కు సీఎం రేవంత్ వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా)ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జైకాతో చర్చలు జరిపింది. జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి బృందం సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జైకా ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు పాల్గొన్నారు. సానుకూల విధానాలు, ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ. 24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బృందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం అంటే రూ.11,693 కోట్లు రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు.జైకాకు... తెలంగాణతో కొన్నేళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా తెలిపారు. జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

డీనోటిఫై చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించింది. తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేసేందుకు వీల్లేదని కేంద్రానికి స్పష్టం చేసింది. వక్ఫ్ బోర్డు లేక కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అందుకు అంగీకారం తెలిపారు. ఈ చట్టంలోని 9, 14 అర్టికల్స్ ప్రకారం బోర్డులు, కౌన్సిళ్లలో నియామకాలు జరగవని హామీనిచ్చారు. 'వక్ఫ్ బై యూజర్' సహా వక్ఫ్‌కు చెందినవిగా నమోదైన ఆస్తులను డీనోటిఫై చేయొద్దని కేంద్రాన్ని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఒకే అంశంపై కుప్పలుగా పిటిషన్లు వస్తే విచారించడం కష్టమని, ఏవో ఐదింటిని మాత్రమే విచారిస్తామని, ఎవరు వాదనలు వినిపిస్తారో పిటిషనర్ల తరపున న్యాయవాదులు నిర్ణయించుకోవాలని పేర్కొంది. కేంద్రం సమాధానం ఇచ్చిన తర్వాత ఐదు రోజుల్లో పిటిషనర్ల ప్రతి స్పందనల (రీజాయిండర్)కు అవకాశం కల్పించింది. మే 5న తదుపరి విచారణ జరుగుతుందని, అప్పటి వరకు స్టేటస్ కో పాటించాలని ఆదేశాలిచ్చింది. కొన్ని సెక్షన్ల ఆధారంగా ఈ చట్టాన్ని ప్రత్యక్షంగా లేక పరోక్షంగా నిలుపుదల చేస్తారా అని ధర్మాసనాన్ని మెహతా ప్రశ్నించారు. రాష్ట్రపతి ఆమోదానికి ముందు పిటిషన్లు దాఖలయ్యాయని, కోర్టు వాటిని వెంటనే విచారణకు స్వీకరించిందని అన్నారు. అనేక సంప్రదింపులు, సలహాలు, సూచనల తర్వాతే వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ చట్టంపై ఇప్పటికిప్పుడే ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని పేర్కొంది. తమ పక్షాన్ని కోర్టు ముందు ఉంచేందుకు వారం రోజుల గడువు ఇవ్వాలని తుషార్ మెహతా కోరారు. కొన్ని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించనప్పటికీ సంబంధిత వక్ఫ్ బోర్డుల్లో నియామకాలు జరగవని హామీనిచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'ఇక్కడ మేమేమీ మార్చడం లేదు. పార్లమెంటు చట్టాలు చేస్తుంది. ఎగ్జిక్యూటివ్‌లు నిర్ణయాలు తీసుకుంటారు. న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయి' అని వ్యాఖ్యానించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో ఐదింటిని మాత్రమే విచారించాలని నిర్ణయించిన న్యాయస్థానం... ఈ కేసు పేరును ఇన్ రీ:వక్ఫ్ (అమెండ్‌మెంట్) యాక్ట్-2025'గా మార్చింది. నోడెల్ కౌన్సిల్‌గా ముగ్గురు న్యాయవాదులను నియమిస్తూ... ఎవరు వాదనలు వినిపిస్తారో నిర్ణయించుకోవాలని లాయర్లకు సూచించింది. తదుపరి (మే 5) జరగబోయే విచారణ ప్రాథమిక అభ్యంతరాలు, మధ్యంతర ఉత్తర్వుల కోసమేనని ధర్మాసనం స్పష్టంచేసింది. వక్ఫ్ చట్టం-1995, దానికి 2013లో జరిగిన సవరణను సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను క్లాజులిస్ట్‌లో వేరుగా చూపాలని సూచించింది. బుధవారం జరిగిన విచారణలో హిందూ బోర్డుల్లో ముస్లింలను చేర్చుతారా అని కేంద్రాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. వక్ఫ్‌గా న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను వక్ఫ్ జాబితా నుంచి తొలగించరాదని... వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ఎక్స్అఫీషియో సభ్యులు మినహా మిగతా వారంతా కచ్చితంగా ముస్లింలే ఉండాలని స్పష్టంచేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని నిబంధనలపై స్టే విధించేలా ప్రతిపాదనలు చేసింది. ఇదిలావుంటే, వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఓ లేఖ రాసింది. బుధవారం విచారణసప్పుడు కోర్టు హాల్‌లో నిలబడడానికి కూడా చోటులేదని, ఊపిరాడక ఇద్దరు న్యాయవాదులు స్పృహ కోల్పోయారని లేఖలో పేర్కొంది.

కునాల్ కమ్రాకు ఊరట

ముంబై: స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాకు బాంబే హైకోర్టు ఊరట ఇచ్చింది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై చేసిన వ్యాఖ్యల కేసులో తాము తుది ఆదేశాలిచ్చేదాకా కమ్రాను అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు వెలువరించింది. కునాల్ కమ్రా వేసిన క్వాష్ పిటిషన్‌పై వాదనలు పూర్తి కావడంతో తీర్పు రిజర్వ్ చేసింది. ఓ షోలో షిండేను ఉద్దేశించి పేరడీ సాంగ్ పాడే క్రమంలో 'దేశద్రోహి' అంటూ కునాల్ కమ్రా వ్యాఖ్యానించిన సంగతి తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యాఖ్యలకుగాను ఖర్ పీఎస్‌లో కమ్రాపై కేసు నమోదు అయింది. అయితే... తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ కునాల్ కమ్రా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎస్.కోత్వాల్, ఎస్.మోదాక్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. అయితే... షిండేను ఉద్దేశించి దేశద్రోహి అనే వ్యాఖ్యలు కేవలం కునాల్ కమ్రా ఒక్కరే చేయలేదని, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ప్రతిపక్షాలు ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి 'ద్రోహి' వ్యాఖ్యలు చేశాయని(అప్పట్లో అజిత్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలు షిండేను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు), అయినప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించలేదని కమ్రా తరపు న్యాయవాది నవ్రోజ్ సీర్వై వాదించారు. ఈ కేసులో కావాలనే తన క్లయింట్, అతని తల్లిదండ్రుల్ని పోలీసులు ఇబ్బంది పెడుతున్నారన్నారు.

మిథున్‌రెడ్డికి హైకోర్టు షాక్

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించింది. ఈ మేరకు ఎంపీ పిటిషన్‌ను తిరస్కరించింది. మిథున్‌రెడ్డిని శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ సీపీ కార్యాలయంలోని సిట్ కార్యాలయానికి హాజరుకావాలని ఏపీ సిట్ బృందం ఇటీవల నోటీసులు జారీ చేసింది. దీంతో తనను అరెస్ట్ చేస్తారని భావించిన మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, ఆయన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీం కోర్టుకు వెళ్లగా ఊరట లభించింది. మిథున్ రెడ్డికి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణకు సహకరించాలని ఎంపీకి సూచించింది. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఏపీ సిట్ ఎదుట హాజరు కావాల్సి ఉంది. ఈ కేసులో నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌కు మూడు సార్లు సిట్ నోటీసులు జారీ కాగా ఆయన ఇప్పటివరకు విచారణకు హాజరు కాలేదు. సాక్షిగా విచారణకు రావాల్సిందిగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు పంపించిన విషయం విదితమే.

పెట్టుబడుల వేట

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసేందుకు వీలుగా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దాదాపు రూ.ఐదువేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలున్నాయి. మారుబేని... ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెట్టనుంది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మారుబేనికి ప్రభుత్వ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దైసకాకురా అభినందించారు. మారుబేని సంస్థ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ రంగాలలో అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 వేలమందికి పైగా ఉద్యోగులను నియమించింది. అనంతరం సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచ్యెరోల్ బృందాన్ని కలుసుకుంది. సోనీ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచ్యెరోల్‌పై చర్చలు జరిపింది. యానిమేషన్, వీఎఫ్ఐ, గేమింగ్ రంగాలలో హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే సీఎం తన భవిష్యత్తు విజన్‌ను వారితో పంచుకున్నారు.

దుబాయ్ హతుల కుటుంబాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

దుబాయ్‌లో హత్యకు గురైన వారిపై రేవంత్‌రెడ్డి స్పందించారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన ఇక్కడి అధికారుల నుంచి వివరాల అడిగి తెలుసుకున్నారు. మృత దేహాలను త్వరగా స్వదేశానికి తెప్పించాలని ఆదేశించారు. దుబాయ్‌లో హత్యకు గురైన ఇద్దరు తెలంగాణ యువకుల కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్ ... దుబాయ్‌లో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయానికి, దిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖలు రాశారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ బి.ఎం. వినోద్ కుమార్ బృందం, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

జపాన్ పరిశోధకురాలిపై ప్రొఫెసర్ లైంగిక దాడి

న్యూఢిల్లీ: దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విదేశీ మహిళా పరిశోధకురాలిపై ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ చేపట్టింది. ఆరోపణలు నిజమని తేలడంతో ప్రొఫెసర్‌ను తొలగించారు. ఈ వేధింపుల ఘటన కొన్ని నెలల క్రితం ఒక విశ్వవిద్యాలయ కార్యక్రమంలో జరిగింది. నిందితుడైన ప్రొఫెసర్‌పై గతంలోనూ అనేక ఫిర్యాదులు ఉన్నాయి. జపాన్‌కు చెందిన ఓ విద్యార్థిని విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తోంది. యూనివర్సిటీ కార్యక్రమంలో భాగంగా ఆమెపై ఓ ఫ్యాకల్టీ సభ్యుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె జపాన్ తిరిగి వెళ్లిన అనంతరం ఈ విషయాన్ని దౌత్యమార్గాల ద్వారా భారత రాయబార కార్యాలయం దృష్టికి తీసుకెళ్లింది. అధికారిక ఫిర్యాదు దాఖలు చేసింది. ఈ అంశాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ... విశ్వవిద్యాలయం దృష్టికి తీసుకొచ్చింది. దీంతో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలు నమ్మదగినవిగా గుర్తించింది. దీని తరువాత నిందితుడైన ప్రొఫెసర్‌ను తొలగించాలని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫార్సు చేసింది. నిందితుడికి విశ్వవిద్యాలయ అప్పిలేట్ కమిటీ ముందు అప్పీల్ చేసుకునే హక్కు లేదా కోర్టును ఆశ్రయించే హక్కు ఉందని తెలిపింది.

రాష్ట్రపతిని నిర్దేశించలేరు

న్యూఢిల్లీ: భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి గడువు నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు. న్యాయవ్యవస్థను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో మాట్లాడారు. కోర్టులు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి మనకు ఉండదని అన్నారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142, 'న్యాయవ్యవస్థకు 24/7 అందుబాటులో ఉన్న ప్రజాస్వామ్య శక్తులపై అణ్వాయుధ క్షిపణిగా మారింది' అని ఆయన అన్నారు. రాష్ట్రాల గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి తప్పనిసరిగా మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఇటీవల తొలిసారి గడువు నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి కూడా జ్యుడీషియల్ రివ్యూకు కట్టుబడి ఉండాలని ఆ తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు సంచలన తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 201 ప్రకారం ఒక బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపినట్టయితే... దానిని రాష్ట్రపతి ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. కానీ రాష్ట్రపతి ఎంత కాలంలోపు నిర్ణయం తీసుకోవాలన్నది రాజ్యాంగంలో పేర్కొనలేదు. అంతమాత్రాన రాష్ట్రపతికి 'పాకెట్ వీటో' అధికారం ఉందని అనుకోరాదంటూ తీర్పు చెప్పింది. అయితే, ఏదైనా ఒక బిల్లు విషయంలో రాజ్యాంగబద్ధతపై ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు మాత్రం కార్యనిర్వాహక వ్యవస్థ కోర్టుల పాత్ర పోషించరాదని, ఆర్టికల్ 143 ప్రకారం దానిని సుప్రీంకోర్టుకు రిఫర్ చేయాలని చెప్పింది.

గ్రూప్-1 అభ్యర్థులకు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. మెయిన్స్ పత్రాల మూల్యాంకనం సరిగా నిర్వహించలేదని, అందుకే అభ్యర్థులు నష్టపోయారని పిటిషనర్లు పేర్కొన్నారు. మూల్యాంకనం, నియామకాలు నిబంధనలకు విరుద్ధమని, తిరిగి మూల్యాంకం చేయాలని, లేదంటే మరోసారి మెయిన్స్ నిర్వహించాలని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకనంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ మేరకు ప్రతివాదులను ఆదేశించాలని 20 మంది గ్రూప్-1 అభ్యర్థులు అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీపీఎస్సీని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

రూ.793 కోట్ల దాల్మియా ఆస్తులు జప్తు

(మొదటిపేజీ తరువాయి)

గనులు, భారతి సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్ పెట్టుబడి పెట్టింది. 2011లో సీబీఐ కేసు నమోదు చేయగా... 2013లో చార్జిషీటు దాఖలు చేశారు. సీబీఐ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ కేసులో ఈడీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసింది. భారతి సిమెంట్స్‌లో పెట్టుబడులు పెట్టినవారిపై ఈడీ దర్యాప్తు నిర్వహించింది. సున్నపు రాయి గనుల లీజులో ఆయాచితి లబ్ధిపొందిన వారి ఆస్తులను జప్తు చేసింది. పునీత్ దాల్మియాకు, విజయసాయి రెడ్డికి మధ్య డీల్ కుదిరిందన్న విషయాన్ని సీబీఐ పేర్కొంది. ఫ్రాన్స్‌కు చెందిన పాసిఫామ్‌కు వాటాలో కొంత భాగాన్ని దాల్మియా అమ్మింది. వచ్చిన సొమ్ములో రూ.55 కోట్లు జగన్‌కు బదిలీ చేశారని సీబీఐ అభియోగాలను మోపిన విషయం విదితమే. 2010 నుంచి 2011 మధ్య హవాలా ద్వారా లావాదేవీలు జరిగాయని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొంది. ఆ ఛార్జిషీట్ ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఐటీ సోదాల్లో లభ్యమైన డీల్‌కు సంబంధించిన వివరాలు, ఆధారాలు వెలుగు చూశాయని, దీంతో రూ.793 కోట్ల ఆస్తులు జప్తు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది.

కశ్మీర్ మాదే:పాక్

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై మాట్లాడిన ఆయన 13 లక్షల బలమైన భారత సైన్యమే తమను ఏమీ చేయలేదనీ, ఉగ్రవాదులు పాకిస్థాన్ ఆర్మీని ఏం చేయగలరని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. బలూచిస్తాన్ వేర్పాటువాదాన్ని తమ సైన్యం అణచివేస్తుందని, మరో 10 తరాల వరకు కూడా ఉగ్రవాదులు విజయం సాధించలేరని చెప్పారు.

ఖాళీచేసి పొండి: భారత్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని గతంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పొరుగుదేశం అక్కడ ఉ పాకిస్థాన్‌కు పీవోకే విదేశీ భూభాగం అవుతుందే తప్ప మరొకటి కాదని అన్నారు. అందుకే ఆ ప్రాంతంలో ఉగ్రవాద వ్యాపారాన్ని సాగిస్తోందన్నారు. ఇటీవల ఐరాస వేదికగా భారత్ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

నిలదీస్తే ఈడీ కేసులా?

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, కొండాసురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, శంకరయ్య, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథ్, సంపత్‌కుమార్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, మాజీ ఎంపీలు వీ హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ' పై కేంద్రం నోరు మెదపదేం?

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నప్పుడు సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చిన రాహుల్ గాంధీ... ఇక్కడి విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా నిలబడతానని చెప్పారని... కానీ ఇప్పుడు ఇంత జరుగుతుంటే రాహుల్ గాంధీ ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. దిల్లీకి రేవంత్ రెడ్డి నోట్ల కట్టలు పంపుతుండటం వల్లే రాహుల్ గాంధీ నోరు తెరవడం లేదని ఆయన ఆరోపించారు.

450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

450 ఎకరాలు అందుబాటులో ఉందని చెప్పారు. ఐటీ హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రుల బృందానికి తెలిపారు. నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ ఏర్పాటయింది. ఆ తర్వాత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రూపు దిద్దుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటీ రంగంలో ఏఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది.

మే 2న ఏపీకి మోదీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణాల పునః ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారికంగా షెడ్యూల్ ఖరారైంది. మే 2న సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను ఆయన ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే రోడ్లు, అధికారిక భవనాలు, ప్రజాప్రతినిధుల టవర్స్, హ్యాపీనెస్ట్ భవనాలు, ఎన్నార్టీ భవన సముదాయం తదితర భవనాలతో పాటు, తాజాగా అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ భవన నిర్మాణాలకు కూడా టెండర్లు ఖరారయ్యాయి. అలాగే రూ.4,668 కోట్ల వ్యయంతో శాశ్వత సచివాలయ భవన నిర్మాణాలకు కూడా సీఆర్‌డీఏ టెండర్లు ఆహ్వానించింది. వీటికి కూడా మే 1వ తేదీ బిడ్లు తెరిచి ఖరారు చేయనున్నారు. దాదాపు రూ.67వేల కోట్ల అంచనా వ్యయంతో వివిధ నిర్మాణపనులన్నింటికీ టెండర్ల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. నిధులకు సంబంధించి కూడా ప్రపంచబ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుల నుంచి ఇప్పటికే 31వేల కోట్లు సమీకరించారు. ఈ నేపథ్యంలో అమరావతికి మరలా దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రధాని నరేంద్రమోదీతో రాజధాని నిర్మాణాలకు పున:ప్రారంభింపజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈనెలలోనే రావాలని కోరినప్పటికీ ప్రధాని షెడ్యూల్ బిజీగా ఉండడంతో మే 2వ తేదీ ఖరారు చేశారు. ప్రధాని నుంచి హామీ తీసుకున్న ముఖ్యమంత్రి ఇప్పటికే ఆయన రాకకోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం, వెలగపూడి సచివాలయం వెనుక భారీ సభా వేదిక ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధం

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర-మహబూబాబాద్ జిల్లా బ్యూరో: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం భారత లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని కొరవి మండల కేంద్రంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా ముస్లిం మైనార్టీలకు సంబంధించిన చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా పార్లమెంటులో బిల్లులను చేయడాన్ని తీవ్రంగా సీపీఐ ఖండిస్తుందని, వక్ఫ్ బోర్డు ఆస్తులను దొడ్డిదారిలో కొల్లగొట్టడానికి బీజేపీ ప్రభుత్వం చేసే కుట్రలో భాగంగానే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులను తీసుకొచ్చిందని ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్, బుడమ వెంకన్న,మజీద్, సదర్ ,ఎస్ కె రషీద్, మజీద్ ముస్నబ్ యూనూస్, జానీ ,మౌలానా ,సలీం రఫీ ,దిన్ ఉసామా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర ప్రతి నిధి-పెద్దపల్లి, సింగరేణి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం అంతర్గాం మండలంలోని బ్రాహ్మణ పల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయవ అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి,గంగయ్య,అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్,రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-మొయినాబాద్: ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణం చేపట్టారని సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తోలుకట్ట గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం మొయినాబాద్ ఎమ్మార్వో గౌతమ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తోలుకట్ట గ్రామంలోని సర్వేనంబర్ 155లో 14 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇం దులో నగరానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడి పార్థివ దేహం పెట్టి సమాధి నిర్మించారని పేర్కొన్నారు. దీనికి పండిట్ రోహిత్ మహారాజ్ దేవస్థానము అని పేరు పెట్టి అందులోకి ఎవరిని రాకుండా భారీ గేటు ఏర్పాటు చేశాడని ఆరోపించారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం కావడంతో రాత్రిళ్లు వింత శబ్దాలు వస్తున్నాయని తెలిపారు. అందరూ భయభ్రాంతులకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా అందులో అసాంఘీక కార్యకలపాలు కూడా నిర్వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. తోలుకట్టలో అనేక ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడడమే తమ లక్ష్యమన్నారు. ఎమ్మార్వో గౌతమ్ కుమార్ ను కలిసిన వారిలో శివశంకర్ గౌడ్, వెంకటయ్య, యాదయ్య, శ్రీకాంత్, వితలయ్య తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - ఇల్లందు : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. పౌష్టికాహారం పై అంగన్వాడి కేంద్రాల ద్వారా మహిళలు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో స్థానిక ఆర్ అండ్ ఆర్ కమిటీ హాల్లో పోషణ పక్షంలో భాగంగా సీమంతాలు, అన్నప్రసాన్న, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారించెందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆమె వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు పాల్గొన్నారు.

మహిళలకు పోషకాహారం తప్పనిసరి

విశాలాంధ్ర- అమనగల్లు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక అన్నారు. పోషణ్ పక్వాడ కార్య క్రమంలో భాగంగా గురు వారం మండల పరిధిలోని పోలేపల్లి, మేడిగడ్డ గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి టీచర్స్ అలివేలు, పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, సంతోష, అనిత, సరోజ బాయి, జైనాబీ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో సమస్యల పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా: భూభారతి చట్టం అమలుతో ప్రజల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సు ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టం ద్వారా ప్రజల భూసంబంధిత సమస్యలు ఇక భవిష్యత్తులో తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్దిదారుడి పట్టా పాస్ బుక్‌లో భూ మ్యాపింగ్ నమోదవుతుందని తెలిపారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్టు పేర్కొన్నారు. సీనియర్ ఉన్నత అధికారులు, భూ చట్టాల, న్యాయ నిపుణులు ఎంతో కాలం కసరత్తు చేసిన తర్వాత భూభారతి చట్టం రూపు దాల్చిందని తెలిపారు. సదస్సులో రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్యాంశాలపై వివరాలు తెలియజేసారు. మండలానికి చెందిన రైతుల నుండి భూసంబంధిత ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సమీక్ష నిర్వహించారు. కొత్త చట్టంతో తమ సమస్యలు తొలగిపోతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు భూభారతి చట్టంపై అవగాహన కలిగేలా జిల్లా సమాచార పౌర సంబంధాలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సారధి కళాకారులు పాటల రూపంలో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ అవగాహనా సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వ్యవసాయ అధికారి సంధ్యారాణి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-తొర్రూరు: ప్రజా సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారి ప్రతినిధుల బృందం ద్వారా తెలియజేశారు. గురువారం తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని పలు సమస్యల పరిష్కారం కోసం 'తొర్రూరు ప్రాంత ప్రజా సమస్యల పరిష్కార పోరాట వేదిక' ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి ప్రతినిధి బృందాన్ని పంపి, నిరాహార దీక్షలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, తొర్రూరు మున్సిపల్ మాజీ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తదితరులు వచ్చి, నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి, దీక్షలో కూర్చున్న వామపక్ష నాయకులను, కార్యకర్తలను నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్ష విరమింప జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ తోరూరు ప్రాంత సమస్యలను నిర్లక్ష్యం చేశారని అందుకు అభివృద్ధి కుంటుపడిందని వారు తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి తొర్రూరు పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తప్పకుండా నిర్మిస్తామని, అదేవిధంగా ఏటీవో కార్యాలయాన్ని కూడా తీసుకువస్తామని, జిల్లాకు మంజూరైన సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి సహకారంతో తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేస్తామని, ప్రధాన రహదారిలో ఇరువైపులా కొత్తగా నిర్మించిన డ్రైనేజీ దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న డాంబర్ రోడ్డు నుంచి డ్రైనేజీ వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపినట్లు వారన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఫైర్ స్టేషన్,

వామపక్ష నాయకులకు ఎమ్మెల్యే హామీ

ప్రత్యేక బాలికల పాఠశాల, తొర్రూరు చెరువును మినీ ట్యాంకుబండ్, పనులు తదితర అంశాలు కూడా కచ్చితంగా అమలు చేసి విధంగా ప్రయత్నం చేస్తామని వామపక్షా నాయకులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్, సీపీఐ నాయకులు ఓమ బిక్షపతి, సీపీఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు ముంజంపల్లి వీరన్న, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఉడుగుల లింగన్న, ఆలకుంట్ల సాయిలు, సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్ సీపీఎం మండల కార్యదర్శి ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్షా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. దీక్షలో పాల్గొన్న నాయకులు కొమ్మనబోయిన యాకయ్య, జమ్ముల శ్రీను, కిరణ్, చింతా నవీన్, ధరావత్ యాకన్న, వల్లపు సాయిలు, సంపత్ పాల్గొన్నారు. ఈ దీక్షకు బాలురు సంఘీభావం తెలిపారు పాల్గొన్నారు.

%×వీ+-20250417-ఔా1103

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

విశాలాంధ్ర-ములుగుజిల్లా బ్యూరో : భూభారతి పోర్టల్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వెంకటాపూర్ మండల కేంద్రం లో శుక్రవారం నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సు కు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నందున నేపధ్యంలో వెంకటాపూర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణం లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సదస్సుల ఇంచార్జీ ఆఫీసర్ ఎస్. కిరణ్ ప్రకాష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డిఓ వెంకటేష్,ములుగు డి ఎస్పీ రవీందర్,ఎం పి డి ఓ రాజు,రెవిన్యూ అధికారులు, గిరిబాబు, జగదీశ్వర్,సృజన్ కుమార్, లక్ష్మి రాజయ్య, రవీందర్,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టం చారిత్రాత్మకం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురు వారం శాసనసభ్యులు బాలు నాయక్ దేవరకొండ రైతు వేదికలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి రైతుకు మేలు జరిగే లా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, రైతుల భూముల సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరించు కోవచ్చని తెలిపారు. రైతుల భూ సమస్యలతోపాటు, ఇండ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలను దీని ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. గ్రామంలో సమస్యలన్నీటిని రెవెన్యూ వ్యవస్థ ద్వారా పరిష్కరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. భూ భారతి చట్టంపై గ్రామ గ్రామాన రైతులకు చెప్పాల్సిన అవసరం ఉందని, 100 సంవత్సరాల వరకు ఈ చట్టం ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. భూభారతి చట్టంలోని సెక్షన్లు, షెడ్యూళ్లు అందరికీ అర్థమయ్యే విధంగా సులభమైన రీతిలో చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ,రైతులు దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధరణి పోర్టల్ లో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు అనేక ప్రయోజనాలను ఈ చట్టంలో కల్పించడం జరిగిందని ,ఇకపై భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని ఆయన తెలిపారు. సన్న బియ్యం పంపిణీ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదని అన్నారు. దీంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు, కులగనన, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి లు భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలిస్తాం: కలెక్టర్

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, భూములపై వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలుపై పరిశీలించడానికి రాష్ట్రంలోని నాలుగు మండలాలను ఎంపిక చేయగా జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించడంతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ మహేందర్ జి తో కలిసి గురువారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో భూమిపై హక్కుల రికార్డుల చట్టం 2025 పై భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుండి అభ్యంతరాలను తెలుసుకున్న అనంతరం కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో భూముల సమస్యలను పరిష్కరించడానికి ధరణి పోర్టల్ ఏర్పాటు చేయగా నేడు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు.పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, రెవెన్యూ సదస్సుల ఇన్చార్జి ఆఫీసర్ ఎస్. కిరణ్ ప్రకాష్, ఆర్డీవో వెంకటేష్, తహసిల్దార్ గిరిబాబు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరి యువకులు మృతి

విశాలాంధ్ర-ఖమ్మం: ఈత సరదా ఇద్దరి యువకుల ప్రాణం తీసింది. ఇంట్లో క్రికెట్ ఆడేందుకు వెళుతున్నామని చెప్పి మున్నేరు బ్రిడ్జి వద్ద ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. ఈ విషాద సంఘటన ఖమ్మం మున్నేరు నది వద్ద గురువారం జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం గుట్టల బజార్ నివాసి కూచిపూడి బిన్విత్ (16) గాంధీ చౌక్కు చెందిన అన్నం కిరణ్ తేజ (16) ఈ ప్రమాదంలో మృతి చెందారు, ఇటీవలనే పదవ తరగతి పరీక్షలు రాసిన ఈ ఇద్దరు విద్యార్థులు పరీక్ష ఫలితాల విడుదల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ ఈ ఘోరం జరిగింది . క్రికెట్ ఆడేందుకు వెళ్లిన తమ పిల్లలు ఇంకా రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ప్రమాద వార్త తెలిసి అక్కడికి వెళ్లి చూడగానే వారి బిడ్డల మృతదేహాలు కనిపించడంతో గుండెలు బాదుకుని రోదించారు. వారి తండ్రులు సుబ్బారావు, ముద్దు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాష్ట్రంలో ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపటమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతిని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. భూభారతి పోర్టల్ అమలులో భాగంగా మారుమూల ఏజెన్సీ గుండాల మండలం ఆళ్లపల్లి గ్రామం రైతు వేదికలో భూభారతి చట్టం తొలి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్క రించుకోవడానికి ఈ చట్టం ద్వారా అవకాశముందన్నారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని ఇపుడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ) ను ఏర్పాటు చేసి భూమి విలువ రూ.5 లక్షల లోపు ఉన్న పక్షంలో రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయి, 5 లక్షల పై ఉన్న పక్షంలో జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించాలని వివరించారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆ రోజు నుండి ఏడాది లోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేసారు. కలెక్టర్ స్థాయిలో సమస్యను పరిష్కారం కానిపక్షంలో సిసిఎల్ఏకు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మండల తహశీల్దార్లు, సబ్ రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇకనుండి చేసే రిజిస్ట్రేషన్ లను అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుం దన్నారు. గతంలో ధరణిలో కొన్ని లోపాలుండడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. భూ భారతిలో రెవెన్యూ రికార్డులను సరిగ్గా మెయింటెన్ చేస్తారని ప్రతి సంవత్సరం భూముల రికార్డుల ను తీసి ఆ ఫైళ్లను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరచడం జరుగుతుంద న్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న భూభారతిలో సైతం ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు భూభారతి పోర్టల్‌లో ఉన్న వివిధ అంశాలపై అవగాహన కల్పిం చారు. ఈ అవగాహన సదస్సులో కొత్తగూడెం ఆర్డీవో మధు, గుండాల తాసిల్దార్ ఇమాన్యుల్, ఎంపీడీవో సత్యనారాయణ, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకాన్ని పెంచేలా పనిచేయాలి: ఎస్పీ

విశాలాంధ్ర-జిల్లా బ్యూరో మహబూబాబాద్: ప్రజలకు పోలీసులపైనమ్మకం పెంచేలా విధులు నేరాల నియంత్రణ చేపట్టాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేక అన్నారు. గురువారం రాష్ట్ర డీజీపి అన్ని పోలీస్ కమిషనరేట్‌ల పోలీస్ అధికారులతో, జిల్లా ఎస్పీలతో నేరాలపై సమీక్షా సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రాంనాథ్ కేకన్ సమావేశంలో మాట్లాడుతూ ప్రజాలలో పోలీస్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా చేపట్టాల్సిన విధులు, నేరాల నియంత్రణ, శిక్షల శాతం పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. రాబోయే వర్ష కాలంను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల నుండి నకిలీ సీడ్స్ జిల్లాలోకి రావడం గాని, జిల్లా నుండి రవాణా కానీ జరగకుండా పూర్తీగా నియంత్రించాలని, అందుకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని, అవసరం ఐతే పిడి యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆరుగాలం శ్రమించి పంటలను పండించే రైతన్న నకిలీ సీడ్స్‌తో మోసపోకుండా చూడాలని, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ లను ఏర్పాటు చేసి నిఘాతో పాటు తనిఖీలు నిర్వహించాలని, నకిలీ సీడ్స్ పై ప్రజలను చైతన్యం చెయ్యాలని అన్నారు. ఫిర్యాదుపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని, ఆయా కేసులలో నిందితులకు పడే శిక్షల శాతం మరింత పెరిగేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని , ట్రయాల్స్ సమయంలో ఉన్నతాధికారులు మానిటర్ చెయ్యాలని, అలాగే టెక్నాలజీ వినియోగంను, పోలీస్ మాన్ పవర్ ఉపయోగించుకోవాలని అన్నారు. రైటర్స్ , ఏ సీసీ టీఎన్ఎస్, రిసెప్షన్, సిడి ఒఎస్ కు వర్టికల్ వారిగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అన్నారు. ప్రతిచోట సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అన్నారు. అన్ని కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, తొర్రుర్ డీఎస్పీ కృష్ణ కిషోర్, డీసీ ఆర్ బి డిఎస్పీ గంద్రతి మోహన్, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్.బి, డి సి ఆర్ బి, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్లు, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల సీఐలు, ఎస్సై, ట్రైనీ ఎస్సై లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూభారతి ద్వారా సత్వర పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర-కొమరం భీం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల రైతు వేదికలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, ఈ చట్టం వల్ల నిజమైన భూమి యజమానికి న్యాయం జరుగుతుందని, ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చిందని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, భూ సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. తహసిల్దార్ జారీ చేసిన ఆర్డర్ పై రాజస్వ మండల అధికారికి అప్పీలు చేసుకోవచ్చని, రాజస్వ మండల అధికారి జారీ చేసిన ఆర్డర్ పై కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే వెసులుబాటు తీసుకువచ్చిందని తెలిపారు. ఇది వరకు ధరణి పోర్టల్ లో ఈ అవకాశం లేదని, విరాసత్ పట్టా మార్పిడి పై సంబంధిత పట్టాదారులకు నోటీసులు జారీ చేసే విధానాన్ని తీసుకువచ్చిందని. భూభారతిలో చాలా సులభమైన మాడ్యూల్ తీసుకురావడం జరిగిందని, ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుందని, ప్రతి రైతు భూభారతి చట్టంలోని హక్కులు, అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర - అమన గల్లు : విత్తనాలు, ఎరువులు అధిక ధర లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సిం హా రావు అన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఎరువుల, విత్తనాల విక్రయానికి సంబంధించి అధీకృత డీలర్లు రైతులకు విధిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించి అందుకనుగుణంగా నిల్వలు ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు కూడ కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రశీదులు తప్పక తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయించి రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ కేసులు తప్పవని నర్సింహా రావు హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

స్టేషన్ రైటర్‌కు ప్రశంసా పత్రం అందజేత

విశాలాంధ్ర-గార్ల : మండల పోలిస్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనుకు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను మహబూబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మెరకు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో శ్రీనుకు ఎస్పీ కేకన్ ప్రశంసా పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభా కనబరిచిన పోలీసులకు ప్రశంస పత్రాలు అందించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత పనితనం తోపాటు అంకితభావాన్ని కలిగిస్తాయని ఎస్పీ అన్నారు. సహచరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ విధులను శ్రద్ధతో నిర్వహించేలా ఈ ప్రశంసా పత్రాలు ఉపయోగపడతాయన్నారు. పోలీసులు నిజాయితీగా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆయన కోరారు. గార్ల-బయ్యారం మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైతుల భూమి హక్కులు భద్రం: కలెక్టర్

విశాలాంధ్ర- నేరేడుచర్ల: భూభారతి చట్టం రైతులకు చుట్టం లాంటిదని రైతుల భూముల హక్కులు భద్రంగా ఉండటంతో పాటు భూ సమస్యలకు తక్షణమే పరిష్కారం లభిస్తుందని, గత ప్రభుత్వ ప్రవేశపెట్టిన ధరణిలోని లోపాలను సవరించడం కోసమే భూభారతి చట్టం రూపొందిందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నేరేడుచర్ల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు కోసం భూ భారతి ఏర్పాటు చేయబడిందని, హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూమి హక్కులు ఉండి రికార్డులు లేని వారికి హక్కుల రికార్డులు నమోదు చేసుకోవడానికి కొత్త చట్టం ద్వారా వచ్చిన సంవత్సరంలోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. భూభారతి చట్టంలో నాలుగు అంశాల ద్వారా భూ సమస్యలు పరిష్కార లభిస్తుందని, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మరియు మ్యుటేషన్ ఒకేరోజు జరుగుతుందని, భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులు నమోదు చేస్తారని, పాసు పుస్తకాలలో రైతుల భూమి పటం ఉంటుందని, భూ సమస్యల పరిష్కారానికి రెండంచుల అప్పిలు వ్యవస్థ ఉందని, అధికార వికేంద్రీకరణతో ఎమ్మార్వో స్థాయి లో పరిష్కారం కాని సమస్యలు ఆర్డిఓ స్థాయిలో, ఆర్డీవో స్థాయిలో పరిష్కారంగాని సమస్యలు కలెక్టర్ స్థాయిలో, కలెక్టర్ స్థాయిలో కూడా పరిష్కారం గాని సమస్యలు సీసీఎల్ఏ ట్రిబ్యునల్ ద్వారా 100% సులభతరమైన పరిష్కారం లభిస్తుందన్నారు. భూమికి సంబంధించిన సమస్యలను రైతులే సులభతరంగా స్వయంగా భూభారతి పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, సామాన్య రైతులు కూడా సులువుగా వినియోగించుకోనేలాగా భూభారతి చట్టం రూపొందిందన్నారు. 2014 జూన్ 2 కంటే ముందు సాదా బైనామాల ద్వారా జరిగిన కొనుగోలును ఆర్డీవో స్థాయిలో విచారణ చేసి అర్హతలు ఉన్నవారికి రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీలు రుసుముతో పట్టాదారు పాసుపుస్తకం ఇస్తారన్నారు. భూదార్ కార్డుల జారీ ఇంటి స్థలాలకు ఆబాది వ్యవసాయేతరా భూములకు హక్కుల రికార్డులు, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఎవరికైనా బుహక్కుల రికార్డు సర్టిఫైడ్ కాఫీ కావాలంటే భూభారతి వారంలో పది రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవడం ద్వారా తాసిల్దార్లు కాఫీ జారీ చేస్తారన్నారు.భూ భారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం /పౌతి అమలు చేసేటప్పుడు గ్రామం లో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు అని ఈ అవకాశం ధరణి లో లేదని తెలిపారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి గ్రామంలో ప్రతి రైతు కి 1 బి అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తామని తెలిపారు.భూములకు ఆధార్ లాగానే భూధార్ అనే యూనిక్ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్‌ని భూ భారతి పోర్టల్ లో అప్డేట్ చేస్తామని అడిషనల్ కలెక్టర్ రాంబాబు హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు,తాసిల్దార్ సైదులు గౌడ్, మండల వ్యవసాయ అధికారి ఎస్కె జావిద్ ,,మార్కెట్ చైర్పర్సన్ విజయలక్ష్మి వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, నేరేడుచర్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కోణతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ రణపంగ. నాగయ్య, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అర్థం లేని ధన్కర్ అభ్యంతరాలు

భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్కర్ ఎప్పుడు ఏం మాట్లాడతారో చెప్పలేం. రాజ్యసభ నిర్వహణలో ఆయన పక్షపాత దృష్టి ఇప్పటికే కావాల్సినంత అపఖ్యాతి పాలైంది. ఆయన ప్రసిద్ధుడైన న్యాయవాది. కొంత కాలం గవర్నర్‌గా కూడా పని చేశారు. గవర్నర్‌గా ఉన్నప్పుడూ ఆయన నడవడిక ప్రతిపక్ష నాయకుడి రీతిలో ఉండేది. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ కోషియారీ రాజ్‌భవన్‌లో ఉన్నప్పుడు పూర్తి ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. బలమైన ప్రతిపక్షం లేని లోటు తీర్చడం గవర్నర్లుగా తమ కర్తవ్యం అని ఈ ముగ్గురూ భ్రమపడ్డట్టు ఉన్నారు. ఇలాంటి గవర్నర్లు మరికొందరు లేకపోలేదు. కానీ తాజాగా రచ్చకెక్కిన వారు ఈ ముగ్గురే. తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా తొక్కిపెట్టడం ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవికి అలవాటుగా మారింది. కొన్ని బిల్లులనైతే ఏళ్ల తరబడి ఆయన తొక్కి పెట్టారు. కొన్నింటిని రాష్ట్రపతికి పంపించారు. రాష్ట్రపతి కూడా ఈ విషయమై ఏ నిర్ణయం తీసుకోలేదు. ఓ శాసనసభ బిల్లులను ఆమోదించడం అంటే ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించడమే. ఆ బిల్లులపై రాష్ట్ర గవర్నర్ సంతకం చేస్తే తప్ప అవి చట్టాలు కావు. పార్లమెంటులో కూడా ఇదే పరిస్థితి. అంతిమంగా రాష్ట్రపతి సంతకం చేస్తేనే పార్లమెంటు ఆమోదించిన బిల్లులు శాసన రూపంలోకి వస్తాయి. గవర్నర్ బిల్లుల మీద సంతకం చేయకుండా నిరవధికంగా తొక్కి పెట్టడం ఒక రకంగా పరిపాలనా క్రమానికి అవాంతరం కలిగించడమే. అందుకే తమిళనాడు ప్రభుత్వం ఆర్‌ఎన్ రవి నడవడిక మీద ఫిర్యాదు చేస్తూ సుప్రీంకోర్టుకు ఎక్కింది. ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద తనకున్న విశేషాధికారాలను ఉపయోగించి గవర్నర్ నిరవధికంగా బిల్లులను తొక్కి పెట్టడానికి వీలు లేదని చెప్పింది. ఈ తీర్పు తరవాత తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ తొక్కిపెట్టిన బిల్లులకు గవర్నర్ సమ్మతి లభించక పోయినా అవి శాసనాలు అయిపోయినట్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇది చాలా అసాధారణ విషయం అని అంగీకరించవల సిందే. కానీ గవర్నర్లు పనిగట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు అడ్డు తగులుతూ ఉంటే ఏ ప్రభుత్వం అయినా చేతులు ముడుచుకుని కూర్చోవడం కుదరదు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిజంగా చరిత్రాత్మకమైంది. దానికి తోడు ఆయన కొన్ని బిల్లులను రాష్ట్రపతికి పంపారు. రాష్ట్రపతి కూడా ఏ నిర్ణయమూ తీసుకోకుండా అట్టి పెట్టుకున్నారు. రాష్ట్రపతి అయినా సరే మూడు నెలలలోగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. గవర్నర్లు, రాష్ట్రపతులు చట్ట సభలు ఆమోదించి పంపిన బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం ఏ గడువూ నిర్దేశించలేదు కనక తమకు కిట్టని లేదా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి గవర్నర్లు సంతకం చేయకుండా ఉండిపోవడం ఆనవాయితీ అయింది. సుప్రీంకోర్టు నిర్ణీత గడువు నిర్దేశించడంతో ఇక మీదట తాత్సారానికి అవకాశం ఉండదు. గవర్నర్లు, కడకు రాష్ట్రపతి కూడా తమ మంత్రివర్గాల సలహా ఆధారంగా పని చేయాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించడం అపూర్వం అని అనుకోవడానికి వీలున్న మాట నిజమే కానీ సుప్రీం న్యాయమూర్తులు చేసిందల్ల రాజ్యాంగం స్పష్టంగా పేర్కొనని అంశాన్ని ఓ కొలిక్కి తేవడం.

ఇది ఉపరాష్ట్రపతికి అభ్యంతరకరమైంది. సుప్రీంకోర్టుకు విశేషాధికారాలు కల్పించే 142 వ అధికరణం "అణ్వస్త్రం"గా మారిపోయిందని ధన్కర్ చాలా బాధ పడిపోతున్నారు. అత్యున్నత న్యాయస్థానమైనా రాష్ట్రపతికి గడువు నిర్దేశించే పరిస్థితి రాకూడదంటున్నారు. రాష్ట్రపతి పదవికి ఉన్న గౌరవాన్ని కచ్చితంగా గౌరవించాల్సిందే. ఎట్టి పరిస్థితిలోనూ ఆ గౌరవానికి భంగం కలగనివ్వకూడదు. కానీ గవర్నర్లు అయినా, రాష్ట్రపతి అయినా నామ మాత్రమైన ప్రభుత్వాధినేతలే. వారు ప్రజలు ఎన్నుకున్న వారు కాదు. కనీసం రాష్ట్రపతిని ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఎన్నుకుంటారు. గవర్నర్‌లకు అదీ లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇష్టాయిష్టాలపై ఆధారపడి గవర్నర్లను నియమించే అపసవ్య విధానం అమలులోకి వచ్చి సుదీర్ఘ కాలమే గడిచింది. 142వ అధికరణం కింద న్యాయవ్యవస్థకు ఉన్న విశేషాధికారాలను ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం అని ధన్కర్ అంటున్నారు. ఈ లోపం ఆయనకు ఇంతకాలం ఎందుకు తట్టలేదో తెలియదు. మోదీ ప్రభుత్వం నియమించిన గవర్నర్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలే ధన్కర్‌కు నచ్చి ఉండకపోవచ్చు. ఆయనకు నచ్చడాన్ని, నచ్చకపోవడాన్నీ నిర్దేశించలేం కాని అది ఆయన బీజేపీకి లొంగిపోయే తత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది అనడం మాత్రం నిజం. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ప్రవర్తన మరీ విచిత్రంగా ఉంది. రాజ్యాంగ నిర్దేశం ప్రకారం అయితే శాసనసభ ఏదైనా బిల్లును ఆమోదించి పంపితే మరీ నెలలు, సంవత్సరాలు తొక్కి పెట్టకుండా సంతకం చేసి వెనక్కు పంపించాలి. లేదా అభ్యంతరాలేవైనా ఉంటే శాసనసభకు తిరిగి పంపించి పునః పరిశీలించమని కోరవచ్చు. అప్పుడు శాసనసభకు ఇష్టమైతే మార్పులు, చేర్పులు చేయొచ్చు. లేదా అదే రూపంలో తిప్పి పంపొచ్చు. అప్పుడు గవర్నర్ గానీ, రాష్ట్రపతి గానీ సంతకం చేసి పంపాల్సిందే. గత్యంతరం లేదు. కానీ ఆర్‌ఎన్ రవి ఉలక్కుండా పలక్కుండా బిల్లులను తొక్కిపెట్టేవారు. ఉపరాష్ట్రపతి ధన్కర్‌కు ఇందులో అనౌచిత్యం ఎందుకు కనిపించలేదో మరి. సుప్రీంకోర్టు చేసిందల్లా ఈ అనౌచిత్యాన్ని తొలగించడమే. రాష్ట్రపతి పని తీరును కూడా పరిశీలించే అవకాశం రాజ్యాంగంలోని 201 అధికరణ క్రింద సుప్రీంకోర్టుకు ఉంది. గత ఎనిమిదవ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలో, తన అభిప్రాయాలో వ్యక్తం చేయడంతో ఉప రాష్ట్రపతి సంతృప్తి పడలేదు. "ఇప్పుడు మనకు శాసనాలు చేసే, కార్యనిర్వాహకవర్గం చేయాల్సిన పనులు చేసే, సూపర్ పార్లమెంటుగా పనిచేసే న్యాయ మూర్తులు ఉన్నారు" అని ధన్కర్ అనడం చాలా తీవ్రమైన అంశమే. రాష్ట్రపతి పదవి అత్యున్నతమైందని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని శపథం చేస్తారని ఉప రాష్ట్రపతి గుర్తు చేశారు. కానీ సుప్రీంకోర్టు తన తీర్పు ద్వారా రాష్ట్రపతికే ఆదేశాలు జారీ చేస్తోంది అని ధన్కర్ అంటున్నారు. ఇవి ఆదేశాల్లాగే కనిపించొచ్చు. కానీ రాష్ట్రపతి కూడా బిల్లులపై సంతకం పెట్టకుండా తాత్సారం చేస్తే నిష్పత్తి ఏమిటి. రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ఉన్న రాష్ట్రపతి నిరంకుశంగా వ్యవహరించవచ్చునని రాజ్యాంగం చెప్పలేదుగా. గవర్నర్లు, రాష్ట్రపతి గడువులోగా బిల్లులపై సంతకం చేయకపోతే అవి చట్టాలు అయిపోతాయి అని సుప్రీంకోర్టు చెప్పడం కూడా ధన్కర్‌కు నచ్చలేదు. ఉప రాష్ట్రపతికి చట్టం తెలియక కాదు. ఆయన రాజస్థాన్ హైకోర్టులో, సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. కానీ ఆయన మనసులో ఉన్న ఆశ ఆయన జ్ఞానాన్ని కమ్మేస్తున్నట్టుంది.

అతి నిరుపేదకు సాయం

నేవెడుతున్నా నువు వస్తావా బావ. ఎక్కడికి, ఎందుకో చెప్పకుండా వస్తావా అంటే ఎలా చెప్పమంటావు. ఏమిటి, ఎందుకు అన్న ప్రశ్నలు నేర్పినందుకని త్రిపురనేని గోపీచంద్ ఒక పుస్తకం అంకితమిస్తాడు. ఆ ప్రశ్నలు వేయకపోతే నిత్య జీవితంలో నిజం తెలియదు. అది సరే వస్తావా అంటున్నావు ఎక్కడికి. ఇంకా ఇంట్లో మూలన కూర్చుంటే ఎలాగయ్యా. శ్రీశ్రీ మహా ప్రస్థానానికి ముందు మాట రాస్తూ నినాదాలతో రోడ్లన్నీ మార్మోగిపోతుంటే ఇంట్లో మూలన కూర్చుంటే ఎలా అని ప్రశ్నిస్తాడు. ఒక పక్క మన ముఖ్యమంత్రి సంపద సృష్టిస్తానన్న పదం పక్కనపెట్టి మనసున్న మారాజులు ఇస్తారని అతి నిరుపేదలను పి.ఫోర్‌తో ఆదుకుంటామని ఒక కొత్త నినాదం అందుకుని అందుకోసం ఒక సమావేశం కూడా జరిపాడు కదా. అందులోకి వస్తావా అని అడుగుతున్నా. ఓరి నీ దుంప తెగ పి ఫోర్ గురించా నీవు ఇంతసేపు మాట్లాడేది. అతి నిరుపేదల లిస్టులోకి నన్నెలా తీసుకుంటారు. భలే వాడివయ్యా అతి నిరుపేదలని ఎక్కడ గీత గీస్తారు. ఇప్పుడు కొన్ని కోట్ల మంది తెల్ల రేషను కార్డుదారులు ఉన్నారు. వారు నిరుపేదలు కారా. పేదలుగా పరిగణించే కదా తెల్ల కార్డులిచ్చారు. మరి వారందరు ఈ లిస్టులోకి రారా. అబ్బే అలాకాదు సొంతం తిండికి గడవని 20 వేల కుటుంబాలను ఎంపిక చేసి ఇక్కడ పుట్టి ఇతర దేశాల్లో వ్యాపారాలలో సంపాదించిన వారిని పోషించమని అడుగుతారట.

పథకం మంచిది కాదని ఎవరూ అనరు కాని నిరుపేదల ఎంపిక చాలా కష్టం. నా పక్కింటి వాడిని ఎంపిక చేసి నన్ను చేయకపోతే నాకు కోపమే. వెంటనే ప్రభుత్వంపై నిరసన

తెలియచేస్తా. అసలు పబ్లిక్‌లో తిరగని కొంతమంది కోటేశ్వరులకు కూడా తెల్లకార్డు ఉంది. అటువంటివి తొలగించడం ప్రభుత్వం వల్ల కావడం లేదు. కొన్ని పథకాలు అర్హులకు అందకుండా అనర్హులకు అందుతున్నాయి. వాటిని గుర్తించిన నాథుడు లేడు. అసలు నన్నడిగితే స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళ గడిచినా అతి నిరుపేదల కోసం దాతలను వెతుక్కోవడం సిగ్గుచేటు. అవినీతిని అరికట్టలేక దాతలను వెతుక్కోవడం అనే ప్రక్రియ ఇంకో వంద ఏళ్ళ కొనసాగిస్తారా అని మేధావులు ముక్కున వేలేసుకున్నా రాజకీయ నాయకులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదు. నాయకుల పరిపాలనలో మార్పు రాకపోతే ఇంకో వంద ఏళ్ళ గడిచినా మార్పు ఊహించలేము.

అసలు ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమో, నాయకుల కోసమో సామాన్యులకు అర్థం కావడంలేదు. చంద్రబాబు ఆలోచనల ప్రకారం అతి నిరుపేదలు గ్రామాలలోనే ఎక్కువ ఉంటారు. బాబుగారి ఆలోచన ప్రకారం ఆయా గ్రామాల్లో పుట్టి పెరిగి దేశ విదేశాల్లో సంపాదించిన వారు అన్ని గ్రామాల్లో ఉండటం అసాధ్యం. సంపాదించిన వారు దానం చేస్తే దానిని ప్రభుత్వం ద్వారా అందిస్తుంది. గతంలో అత్త సొమ్ము అల్లుడు దానం చేశాడనే సామెతలాగ ఉంది ప్రభుత్వ ఆలోచన. అసలు నిరుపేదలను ఎంపిక చేయడంలో అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీల గ్రామాలలోని నాయకుల సారథ్యంలో జరగాలి. సొంత సంపాదనకు అలవాటు పడ్డ నాయకులు ఎక్కడో ఉండి పంపే సొమ్ముకు న్యాయం చేస్తారా అనేది కూడా ఆలోచించాలి. ప్రతి దాంట్లో నాకేంటి అనే చోటా నాయకుల అవినీతికి కళ్లెం వేయడం ప్రభుత్వం వల్లకాని పని. అసలు కోట్ల తెల్ల కార్డులున్న వారిలో వడపోసి ఎంపిక చేయటం ఒక సాహసమైన చర్య. ఈ ప్రక్రియ వల్ల కూటమి ప్రభుత్వానికి మంచి జరుగుతుందా లేక విరోధస్తులు పెరిగి చెడు జరుగుతుందా అనే మీమాంస పార్టీ వర్గాల్లో కొన్ని చోట్ల చర్చనీయాంశంగా మారింది.

అది సరేనయ్యా అసలు పి ఫోర్ అంటే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్ షిప్ అని బాబుగారు పెట్టినది. ఒకపక్క ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ఎత్తి వేయడానికి సిద్ధమవుతున్న బాబుగారు ఈ పి ఫోర్ తెలుగులో ఎందుకు పెట్టలేదో మరి. అసలు ఎక్కడికక్కడ గ్రామాల్లో అతి నిరుపేద కుటుంబాలకు ఏదైనా అగ్ని ప్రమాదం లాంటి విపత్తులు ఏర్పడినప్పుడు ఆ గ్రామ వాసులు వారిని ఆదుకోవడం ఎప్పటి నుంచో ఉంది. వారికి ఆహారం, బట్టలు ఇచ్చి ఆదుకుంటారు. ఇప్పుడు కొత్తగా అటువంటి దీనస్థితిలో ఉన్న వారి కోసం బాబుగారు పి ఫోర్ కనిపెట్టారు. మంచిదే కాని ప్రస్తుతం అటువంటి ఉదార హృదయాలు అతి తక్కువ. ఒకవేళ కొంతమంది ఉన్నా కోట్ల రూపాయలు తిరుమల స్వామి వారి హుండీలో వేస్తారు గాని ఈ విధంగా పేదల పాలిట కల్పవృక్షంగా మారి దానం చేసిన వారు అతి తక్కువ. బాబుగారి పిలుపు మేరకు బడా బాబులు ముందు కొచ్చినా ప్రభుత్వ పరంగా వారి పరిశ్రమలకు ఏవో ఆశించి వచ్చేవారే ఎక్కువ. నేనిస్తే నాకేంటి అనే వారే ఎక్కువ. అమరావతిలో మరో కొన్ని వేల ఎకరాలు రైతుల నుంచి సేకరించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఇటువంటి ఉదారులకు లబ్ధి చేకూరుస్తారేమో చూడాలి. ఏమీ ఆశించకుండా దానశీలురు వస్తారంటే నమ్మలేం. అయితే అమరావతి ప్రజల కోసమా, బడా వ్యాపారస్తుల కోసమా అనే అనుమానం కలుగవచ్చు. ఏది ఏమైనా తిమ్మిని బొమ్మిని చేయగల బాబుగారి ఆలోచనల ఫలితం వేచి చూడవలసిందే.

సెల్: 9885569394

కూటమి ప్రభుత్వ హ్రస్వ దృష్టి

టి.లక్ష్మి నారాయణ

దీర్ఘకాలిక కరువు పీడిత ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కృష్ణానదీ జలాల హక్కుల పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలోని గోదావరి నదీ పరీవాహక ప్రాంతం, కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద, ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్రలో గోదావరి నదీ జలాలను గరిష్ఠంగా వినియోగించాలి. ఈ లక్ష్యానికి అనుగుణంగా గోదావరి - కృష్ణా - పెన్నా నదుల (పోలవరం-సోమశిల) అనుసంధాన పథకాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేయాలి. ఇలా ఆదాచేసిన కృష్ణా జలాలను శ్రీశైలం జలాశయం నుంచి తెలుగుగంగ, హంద్రీ - నీవా సుజల స్రవంతి, గాలేరు - నగరి సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులకు వినియోగించాలి. ఇది హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన, ఆచరణీయమైన శాశ్వత పరిష్కారం. ఈ రాజకీయ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలి. కరవు పీడిత ప్రాంత ప్రజల కడగండ్లు తీర్చే నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఘరానా దోపిడీకి రాచమార్గంగా నిర్మాణ సంస్థలు మార్చేశాయి. పాలకుల సంకల్ప లేమి - అలసత్వం - అవినీతి, అధికారుల స్వార్థం - అవినీతి, కాంట్రాక్టర్ల దోపిడీకి నిలువెత్తు సాక్ష్యాలుగా మూడున్నర దశాబ్దాలుగా నిర్మాణంలోనే ఉన్న పెండింగ్ ప్రాజెక్టులుగా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు కృష్ణానదీ జలాలపై ఆధారపడి నిర్మాణంలో ఉన్నాయి, పాక్షికంగా వినియోగంలోకి కూడా వచ్చాయి. శ్రీశైలం జలాశయం నుంచి గురుత్వాకర్షణ (గ్రావిటేషన్) ద్వారా శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ(ఎస్సార్బీసీ), తెలుగు గంగ, గాలేరు నగరి ప్రాజెక్టులను రూపొందించారు. ఎస్సార్బీసీ నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. వినియోగంలో ఉన్నది. తెలుగు గంగ నిర్మాణం దాదాపు 85శాతం పూర్తయిందని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. గాలేరు నగరి మొదటి దశ దాదాపు పూర్తయింది, నిర్దేశిత సాగుభూమి అత్యధికంగా ఉన్న రెండవ దశను ప్రభుత్వమే అటకెక్కించి క్షమించరాని అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఇదీ! పూర్వరంగం. కృష్ణానదీ జలాలను గురుత్వాకర్షణ పద్ధతిలో అందించడానికి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు, సముద్ర మట్టానికి 148 అడుగుల ఎత్తు నుంచి గోదావరి వరద నీటిని ఎత్తిపోతల ద్వారా 986 అడుగుల ఎత్తుకు తరలించి, 869 అడుగుల ఎత్తులో ఉన్న బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేర్చి, పైన ప్రస్తావించిన ప్రాజెక్టులకు నీటిని సరఫరాచేసి, నిత్య కరువు పీడిత ప్రాంతాలకు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్న మాటలు గారడీ మాటలు కాక మరేంటి!

"జల హారతి కార్పొరేషన్" పోలవరం - బనకచెర్ల అనుసంధాన భారీ ఎత్తిపోతల పథకాన్ని రూ.80,112 కోట్ల ప్రాథమిక వ్యయ అంచనాతో నిర్మాణాన్ని చేపట్టడానికి, ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ, కంపెనీల చట్టం - 2013 ప్రకారం 100శాతం ప్రభుత్వ యాజమాన్యంలో "జల హారతి కార్పొరేషన్"ను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ నెల 8న జీవో ఎమ్మెస్ నెం.16ను జారీ చేసింది. పోలవరం జలాశయం నుంచి శ్రీశైలం కుడి ప్రధాన కాలువపై నిర్మించి, వినియోగంలో ఉన్న బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు సముద్రం పాలవుతున్న గోదావరి నది వరద నీటిని తరలించడానికి పోలవరం - బనకచెర్ల అనుసంధాన పథకాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు స్థిరమైన నీటి వనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని కరువు నుంచి కాపాడుతుందని, ఆంధ్రప్రదేశ్‌లోని నీటి కొరత ఉన్న అన్ని జిల్లాల్లో దాదాపు 7.41 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 22.58 లక్షల ఎకరాల స్థిరీకరణకు సాగునీరు సరఫరా చేయడం, సుమారు 80 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు 20 టీఎంసీలను సరఫరా చేయడం జరుగుతుందని జీవోలో పేర్కొన్నారు. జలసంబంధ అధ్యయనాల ఆధారంగా గోదావరి నది ఎగువ, దిగువ వినియోగాలను తీర్చిన తర్వాత 90 నుంచి 120 రోజుల పాటు వరద నీరు సముద్రంలో కలుస్తున్నదని ప్రస్తావించారు. ఈ పథకం విజయవంతమవ్వాలంటే పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లె కొండల శ్రేణిలో బనకచెర్ల రెగ్యులేటర్‌కు వెళ్లే మార్గంలో 150 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కొండలను కలుపుతూ "ట్రాన్సిట్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్"ను నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యలసీమ జిల్లాల నీటి అవసరాలను తీర్చడానికి అనేక నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని (గురుత్వాకర్షణ ద్వారా నీరు ప్రవహించే ఈ ప్రాజెక్టులన్నీ కృష్ణా నదీ జలాలపై ఆధారపడి, మూడున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు), వాటికి శ్రీశైలం కుడి ప్రధాన కాలువ ద్వారా శ్రీశైలం రిజర్వాయరు కుడి వైపున నిర్మించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని సరఫరా చేసే ఏర్పాటు ఉన్నదని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నదిని బనకచెర్ల రెగ్యులేటర్‌కు అనుసంధానించడానికి, "ఓపెన్ కెనాల్స్, లిఫ్టులు, భూగర్భ పైపులైన్‌లు, నల్లమల కొండ శ్రేణి గుండా నిర్మించనున్న సొరంగ మార్గం ద్వారా గోదావరి వరద నీటిని తరలించడానికి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. "స్పెషల్ పర్పస్ వెహికల్"ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతామని, ఇది "సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్" అని అభివర్ణిస్తూ బ్యాంకులు ఆర్థిక సంస్థల నుంచి, అలాగే ప్రభుత్వం నుంచి ఈక్విటీ సహకారం కూడా పొందవచ్చునని ప్రస్తావించారు. రూ.10 ముఖ విలువతో 50,00,000 షేర్లను అంటే ఐదు కోట్లు మూలధన పెట్టుబడిని రాష్ట్ర ప్రభుత్వం జల వనరుల శాఖాధికారుల పేరిట పెట్టి, ముఖ్యమంత్రి ఛైర్మన్, రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి వైస్ ఛైర్మన్‌గా జల హారతి కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

జగన్ ప్రభుత్వ కార్పొరేషన్‌ల దుస్థితి

"జలయజ్ఞం"లో భాగంగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసమంటూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం "స్పెషల్ వెహికల్ పర్పస్" అంటూ నాలుగైదు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. రాయలసీమ కరువు నివారణా పథకం కింద 33, కృష్ణా - కొల్లేరు కరువు నివారణా పథకం కింద 6, పల్నాడు కరువు నివారణా

పథకం కింద 5, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కింద 4, ఏపీ రాష్ట్ర జల భద్రత అభివృద్ధి ప్రాజెక్టుల కింద 3, మొత్తం 51 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాతిపదికన ఐదేళ్లలో రూ.72,000 నుంచి రూ.74,000 కోట్లు వ్యయంచేసి నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ ఆ కార్పొరేషన్స్‌ను ఏర్పాటు చేశారు. అవి నేటి కూటమి ప్రభుత్వ పాలనలో ఉనికిలో ఉన్నాయో! లేదో!, వాటి స్థితిగతులపైన వాటి ద్వారా ఒనగూడిన ప్రయోజనాలు లేదా దుష్ఫలితాలపైన ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి.

ఆంధ్రప్రదేశ్ రాయలసీమ కరవు నివారణ ప్రాజెక్టుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్‌ను ఏర్పాటుచేస్తూ 2020 జూన్ 26న జీవో ఎమ్మెస్ నెం.28ను గత ప్రభుత్వం జారీ చేసింది. రూ.40,480 కోట్ల వ్యయంతో 33 ప్రాజెక్టులను నిర్మిస్తామంటూ జాబితాను ప్రకటించారు. 8,08,000 ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 39,25,971 ఎకరాల స్థిరీకరణకు నీటి సరఫరా చేస్తామని వెల్లడించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న సాగునీటి పారుదల కాలువల వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడానికి, కొత్త ప్రాజెక్టులను నిర్మించడానికి వీలుగా శ్రీశైలం జలాశయం నుంచి గతంలో నిర్దేశించిన 120 రోజుల వ్యవధిలో కాకుండా 30 నుంచి 40 రోజుల్లో అవసరమైన నీటిని తరలిస్తామంటూ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఇందులో భాగంగానే చేపట్టారు. దాని ద్వారా రోజుకు 3 టీఎంసీల నీటిని సంగమేశ్వరం వద్ద నుంచి ఎత్తిపోతల ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి మొదలయ్యే శ్రీశైలం కుడి ప్రధాన కాలువ 4 కి.మీ. వద్ద కాలువలోకి తరలించి, బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేర్చి, వినియోగించుకుంటామని నాడు జగన్ ప్రభుత్వం చెప్పింది. దాని నిర్మాణ పనులు 18.42శాతం జరిగినట్లు కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన 2024-25 సామాజిక - ఆర్థిక అధ్యయన నివేదికలో పేర్కొన్నది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని జగన్ ప్రభుత్వం రు.3,825 కోట్ల వ్యయ అంచనాతో 2020 ఆగస్టులో ప్రకటించి, నిర్మాణ పనులను ప్రారంభించింది. తద్వారా జలవివాదాన్ని రెచ్చగొట్టడానికి తెలంగాణకు అవకాశం కల్పించారు. ఆ పథకాన్ని తెలంగాణ వాసులు, కేసీఆర్ ప్రభుత్వం వివాదాస్పదం చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో వ్యాజ్యం కూడా దాఖలు వేశారు. విచారణ చేపట్టి, కృష్ణానదీ యాజమాన్య బోర్డు అధికారుల బృందంతో క్షేత్ర స్థాయి విచారణ జరిపించి, వారిచ్చిన నివేదిక ఆధారంగా ట్రిబ్యునల్ దాని నిర్మాణంపై "స్టే" విధించింది. పర్యవసానంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం ఆగిపోయింది.

రాయలసీమ ఎత్తిపోతల పథకాల నిర్మాణం పేరిట రు.900 కోట్లు గ్రామీణ విద్యుదీకరణ సంస్థ(ఆర్‌ఈసీ) పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్పు తీసుకొని, ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండానే, నేరుగా కాంట్రాక్టు సంస్థ ఖాతాలో జమ చేసినట్లు నేటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నాడు ఆరోపించారు. ఆ ఆరోపణపై స్పందించిన జగన్ ప్రభుత్వం ఒక ప్రకటన ద్వారా "రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ "స్టే" విధించక ముందు జరిగిన పనులను పరిశీలించిన మీదటనే ఆర్‌ఈసీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రు.739.5 కోట్లు రుణం మంజూరు చేశాయని, ఆ మొత్తాన్ని ప్రభుత్వ అనుమతితోనే కాంట్రాక్టు సంస్థ ఖాతాకు నేరుగా జమ చేశారని వెల్లడించింది. కానీ, రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సంబంధించిన నిర్మాణ పనులకు ఎంత వ్యయం చేశారో! ప్రభుత్వం తెలపలేదు. ప్రభుత్వం ఆర్‌ఈసీ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ల నుంచి తీసుకొన్న రుణం మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా కాంట్రాక్టు సంస్థకు నేరుగా జమ చేయడం ఆర్థిక క్రమశిక్షణను ఉల్లంఘించడమే.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది గడుస్తున్నా ఎలాంటి చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. రాయలసీమ ఎడారి నివారణా పథకమంటూ ఆశలు రేకెత్తించి, తెలంగాణ రాష్ట్రంతో నెలకొని ఉన్న జల వివాదానికి మరికాస్త ఆజ్యం పోసింది తప్ప, దీని వల్ల అంతకు మించిన ప్రయోజనం ఒనగూడలేదు. అలాగే, రు.8,276 కోట్లు వెచ్చించి ఆరు ప్రాజెక్టులను నిర్మిస్తామంటూ ఆంధ్రప్రదేశ్ పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టుల కార్పొరేషన్ లిమిటెడ్ ను, రు.9,277 కోట్లు వ్యయంతో ఐదు ప్రాజెక్టులను నిర్మిస్తామంటూ, ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను, రు. 3,350 కోట్లు వెచ్చించి ఆంధ్రప్రదేశ్ గోదావరి - కృష్ణా లవణీయత తగ్గింపు, నీటి భద్రత నీటిపారుదల ప్రాజెక్ట్స్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ను నాటి జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్ల ద్వారా నిర్మాణ పనులు జరిగినట్లు 2024-25 సామాజిక - ఆర్థిక అధ్యయన నివేదికలో ప్రస్తావన లేదు. కరువు పీడిత ప్రాంతాల నీటి సమస్య శాశ్వత పరిష్కారం, కృష్ణా నదీ జలాల హక్కుల పరిరక్షణపై ఆధారపడి ఉన్నది. గోదావరి జలాలను గరిష్ఠంగా రాష్ట్రంలోని గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోను, కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద, ఉత్తరాంధ్ర - దక్షిణ కోస్తా ప్రాంతాల్లో వినియోగించుకోవాలి. ఈ లక్ష్యానికి అనుగుణంగా గోదావరి, కృష్ణా, పెన్నా నదుల (పోలవరం - సోమశిల) అనుసంధాన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో అమలు చేయాలి. తద్వారా ఆదా అయ్యే కృష్ణా జలాలను శ్రీశైలం జలాశయం నుండి నిర్మాణంలో ఉన్న తెలుగు గంగ, హంద్రీ - నీవా సుజల స్రవంతి, గాలేరు - నగరి సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులకు అందజేయాలి. ఇది సవ్యమైన ఆలోచన. రాజకీయ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక

కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు!

ఎస్.బాల్‌రాజ్

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత రోజు రోజుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచటంతో వాహనాల రవాణా చార్జీలు విపరీతంగా పెరిగి నిత్యావసర వస్తువులను సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిత్యం దేశాభివృద్ధికి వివిధ వృత్తులలో రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేస్తున్న కార్మిక లోకానికి కనీస వేతనాలను పెంచకపోగా ధరలను పెంచి మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గితే, పెట్రోల్, డీజిల్ రేట్లు కూడా తగ్గించాల్సివుండగా, కేంద్ర ప్రభుత్వం అలా చేయకుండా మరింత పెంచి ప్రజలపై భారం మోపుతున్నది. దీనివల్ల ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారి, పేదలు మరింత పేదలవుతున్నారు. దేశంలోని కార్పొరేట్ల, పెట్టుబడిదారుల ఆస్తులు విపరీతంగా పెరిగేవిధంగా మోదీ ప్రభుత్వ విధానాలున్నాయి. ఆ విధానాల వల్ల పేద మధ్యతరగతి, ధనిక వర్గాల మధ్యన దూరం పెరుగుతోంది. కేంద్రంలో బీజేపీ అధికారానికి వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందనీ, దేశం వెలిగిపోతుందనీ, మంచిరోజులు వస్తాయన్న మోదీ మాటలు నమ్మి ఓట్లేసి అధికారం అప్పగిస్తే, తన పాలన ప్రజా పాలన కాకుండా, ప్రజల మేలు కోరకుండా పెట్టుబడిదారుల, కార్పొరేట్ శక్తుల, బడా వ్యాపారస్తుల ఆస్తులు పెరగటమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోంది.

బీజేపీ అధికారానికి వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్ ధర రూ.380లోపు ఉంటే ఈ 11 సంవత్సరాల కాలంలో దాని ధర 905 రూపాయలకు పెరిగి ప్రజలకు కొనుగోలు శక్తి తగ్గుతోంది. దీనివల్ల ప్రజలపై మోపిన భారం 3700 కోట్ల రూపాయలను పెట్రోలియం ఉత్పత్తులపై సర్‌చార్జ్‌తో ప్రభుత్వం వసూలు చేస్తూ పెంచిన ధరల పెంపు సొమ్మును కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు మోదీ కట్టబడుతున్నారు. దేశాభివృద్ధి కంటే కార్పొరేట్, పెట్టుబడిదారుల అభివృద్ధే మోదీకి ప్రధానంగా కనబడుతోంది. పేదలపై ధరల భారాలు మోపి కార్పొరేట్లకు వరాలు ఇస్తూ ప్రజలపై వంట గ్యాస్ ధరలు పెంచిన మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని దేశమంతా నిరసన కార్యక్రమాలు చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైయినా లేదంటే ఈ ప్రభుత్వం పేదలదా? పెత్తందార్లదా? నాటి బ్రిటీష్ పాలనలో

కూడా ఇన్ని అవస్థలకు ప్రజలు గురికాలేదు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతోందని, ప్రజలు మండిపడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి వారి బ్రతుకు మరింత దినదిన గండంగా గడుపుతుంటే, మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

బలహీన వర్గాలకు, పేదలకు, దీపం ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసిన ఉజ్వల పథకం ద్వారా కనెక్షన్లు ఇచ్చిన వాటికి కూడా కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచటం చాలా దారుణమైన విషయం. ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం పెరుగుతున్న ధరల వల్ల సిలిండర్లు కొనలేక దీపం పథకం సిలిండర్లను ఉపయోగించుకోలేక మళ్లీ వెనుకటి రోజులలో అడివిలోని కట్టెలను కొట్టి పొయ్యిలో పెట్టే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తుండటాన్ని చూసి ప్రజలు విసిగెత్తుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మహాలక్ష్మీ పేరుతో పేదలకు 500ల రూపాయలకే సిలిండర్ ఇస్తున్నందున ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలతో రాష్ట్ర ప్రభుత్వంపైన కూడా ఆర్థిక అధికభారం పడుతున్నది. దీనివల్ల ఒక ప్రక్క ప్రజలు, మరోప్రక్క రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇబ్బందులకు గురవుతారన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవటంతో ప్రజలే సిరియస్‌గా ఆలోచించి పోరాటాలకు, ఉద్యమాలకు శ్రీకారం చుట్టేరోజు దగ్గరలో లేకపోలేదు.

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఫోన్: 8074246685

'ఉపాధి' కార్మికుల పొట్టకొట్టే కుట్ర

మోదీ సర్కారుపై మల్లికార్జున ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ: ఉపాధి హామీ పథకం కార్మికుల రోజువారీ వేతనాలను పెంచడానికి నిరాకరించడం ద్వారా మోదీ సర్కారు పేదలను నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ), అమర్‌జీత్ సిన్హా నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులనుసైతం ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉపాధి కార్మికుల రోజువారీ వేతనం రూ.400కు, ఏడాదిలో కనీస పనిదినాల సంఖ్య 150కి పెంచాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌ను పెంచడానికి ప్రభుత్వం నిరాకరించడం దాని పేదల వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తుందని ఖర్గే ఎద్దేవా చేశారు. "ప్రజా వ్యతిరేక మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం వేతనాలను పెంచడానికి నిరాకరించినట్లు కనిపిస్తోంది. ఇది కార్మికుల హక్కులపై దాడి చేయడం లాంటిది. ఇటీవల జాయింట్ పార్లమెంటరీ కమిటీ కార్మికుల రోజువారీ వేతనాన్ని రూ. 400కు పెంచాలని సిఫార్సు చేసింది. 2023లో ఏర్పడిన అమర్జీత్ సిన్హా ఉన్నత స్థాయి కమిటీ కూడా వేతనాలు పెంచాలని, పథకం బడ్జెట్ పెంచాలని సూచించింది' అని ఖర్గే అన్నారు. పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం ఉపాధి కార్మికుల హక్కుల అణచివేతను లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. ఆధార్ ఆధారిత చెల్లింపు నిబంధన అమలు చేయడం ద్వారా దాదాపు ఏడు కోట్ల మంది నమోదిత కార్మికులను ఉపాధి హామీ పథకం నుండి మినహాయించడానికి కుట్ర పన్నిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానిదే నిర్ణయం

కర్నాటకలో కులగణన నివేదికలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే స్పందించారు. కులగణన నివేదికలో ఏముందో తనకు తెలియదని, దీనిపై నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక హక్కు అని ఖర్గే అన్నారు. 'కుల గణనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది. ప్రతి రాష్ట్రంలోనూ, వారే స్వయంగా నిర్ణయం తీసుకుంటారు. కులగణన నివేదికను నేను చూడలేదు. కేబినెట్‌లో దీనిపై ఏం చర్చించారో నాకు తెలియదు' అని ఆయన అన్నారు. కాగా, ఇటీవల కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. 'సామాజిక ఆర్థిక, ఎడ్యుకేషనల్ సర్వే' అని పేరు పెట్టిన ఈ నివేదికపై చర్చించడానికి ప్రత్యేక కేబినెట్ సమావేశం జరగనుంది.

లోకోపైలట్ల పని పరిస్థితులు దారుణం

రైలు ప్రయాణికుల ప్రాణాలతో కేంద్రం చెలగాటం: రాహుల్

న్యూఢిల్లీ: లోకో పైలట్ల పని పరిస్థితులపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అమానవీయ పరిస్థితుల్లో పని చేయించడం వారికి అన్యాయం చేయడమే కాకుండా... కేంద్రంలోని మోదీ సర్కారు రైళ్లలో ప్రయాణించే కోట్లాది మంది ప్రయాణికుల ప్రాణాలతో ఆటలాడుతోందని దుయ్యబట్టారు. గ్రాంట్, అవసరమైన విరామాలను కూడా ఇవ్వడానికి నిరాకరించడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. వారి ప్రాథమిక డిమాండ్లను తిరస్కరించిన రైల్వే... కంటి తుడుపు కోసమే కమిటీ ఏర్పాటు చేస్తోందన్నారు. మహిళా సిబ్బంది టాయిలెట్ సౌకర్యం లేకుండా ఎనిమిది గంటల డ్యూటీ చేయాల్సి వచ్చిందన్న మీడియా నివేదికను కూడా 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. 'గత సంవత్సరం, నేను రైల్వే లోకో పైలట్లను కలిసినప్పుడు... వారి సమస్యల్ని విన్న నాకు చాలా ఆందోళన కలిగింది. 14 గంటల షిఫ్ట్‌లు, నిరంతర రాత్రి డ్యూటీ, తగినంత విశ్రాంతి , ఆహార విరామం , టాయిలెట్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు' అని రాహుల్ అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత రైల్వే దానిని మానవ తప్పిదంగా పేర్కొంటూ బాధ్యత నుండి తప్పించుకుంటోందన్నారు. స్థిర పని గంటలు , మెరుగైన వాతావరణం వంటి వారి ప్రాథమిక డిమాండ్లు కాగా... ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని రాహుల్ మండి పడ్డారు. పరిష్కారం కనుగొనే ఉద్దేశం వారికి లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం అర్థవంతమైన చర్య తీసుకునే వరకు లోకో పైలట్లకు మద్దతుగా

నిలుస్తానని.. సమస్యల్ని లేవనెత్తడం కొనసాగిస్తామని రాహుల్ ప్రతినబూనారు.

21న అమెరికాకు రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆయన ఈనెల 21, 22 తేదీల్లో అమెరికా పర్యటించనున్నారు. ఆ పార్టీ నేత పవన్ ఖేడా గురువారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఏప్రిల్ 21, 22 తేదీల్లో రాహుల్‌గాంధీ అమెరికాలో పర్యటిస్తారని ఖేడా తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారన్నారు. ఆ వర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడతారని తెలిపారు. దీనికి ముందు ఆయన ఎన్నారై సంఘ సభ్యులతో పాటు ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతోను సమావేశమవుతారని వెల్లడించారు. గతేడాది సెప్టెంబరులో రాహుల్ మూడురోజులు అమెరికాలో పర్యటించారు. ఆ సమయంలో రాహుల్ చాలా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాహుల్ రిజర్వేషన్లు, భారత్‌లో మతస్వేచ్ఛ వంటి అంశాలపై మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు ఇక్కడ తీవ్ర దుమారం రేపాయి. సిక్కులను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.

సీఎం స్టాలిన్‌తో కమల్‌హాసన్ భేటీ

చెన్నై: ప్రముఖ సినీనటుడు, 'మక్కల్ నీదిమయ్యం' నాయకుడు కమల్‌హాసన్ సచివాలయంలో గురువారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీ అనంతరం కమల్ మీడియాతో మాట్లాడుతూ గవర్నర్‌కు వ్యతిరేకంగా జరిపిన న్యాయపోరాటంలో ముఖ్యమంత్రి గెలిచిన ఆనందోత్సాహంలో తాను కూడా పాలుపంచుకోవడానికే ఆయనతో సమావేశమయ్యానని చెప్పారు. గవర్నర్ విధులు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి ఉన్న అధికారాలు, మంత్రివర్గం నిర్ణయాలను గవర్నర్ శిరసావహించాలని సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు ఈ రాష్ట్రానికే కాకుండా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందన్నారు. ఇంతటి చారిత్రాత్మక తీర్పు సాధించినందుకు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అభినందనలు తెలియజేశానని కమల్ తెలిపారు. స్టాలిన్‌తో నియోజకవర్గాల పునర్విభజన గురించి తానెలాంటి చర్చలు జరపలేదన్నారు. రాజ్యసభ సీటు కోరే విషయమై కూడా స్టాలిన్‌తో మాట్లాడలేదని, అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది గడువు ఉండటంతో ఈ రెండు విషయాలు ప్రస్తావించలేదని కమల్ తెలిపారు.

బెంగాల్ టీచర్లకు ఊరట

అప్పటి వరకు ఉద్యోగాల్లో కొనసాగొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లుబాటు కాదంటూ ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అయితే ఈ వ్యవహారంలో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. నియామక ప్రక్రియ ద్వారా ఎంపికై, ఎలాంటి ఆరోపణలు లేని... 9-12 తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కొనసాగించడానికి అనుమతించింది. కొత్త నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు బోధన కొనసాగించొచ్చని చెప్పింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు తుది గడువు విధించింది. మే 31లోగా కొత్త నియామక ప్రక్రియ కోసం ప్రకటన ఇవ్వాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియ డిసెంబర్ 31లోగా పూర్తికావాలని స్పష్టంచేసింది. 'దీనికి సంబంధించి మే 31లోగా రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాలు జారీ చేశారు. ఈ స్వల్ప ఊరట గ్రూప్-సి, గ్రూప్-డి ఉద్యోగులకు వర్తించదు. టీచర్ల నియమకాన్ని రద్దు చేస్తూ ఈనెల ప్రారంభంలో సుప్రీం తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరి నియామక ప్రక్రియ యావత్తూ అక్రమాలతో కూడుకొని ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. టీచర్లు, ఇతర సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు గత సంవత్సరం ఏప్రిల్‌లో వెలువరించిన తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బంది ఇప్పటివరకూ తాము పొందిన జీతభత్యాలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. మానవీయ కారణాలరీత్యా కొందరు దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ తీర్పు నుంచి మినహాయింపు ఇచ్చి వారు ఉద్యోగంలోనే ఉంటారని స్పష్టంచేసింది. వివాదాస్పదంగా మారిన ఈ నియామకాలు 2016లోనే జరిగాయి. అయితే సుప్రీం ఆదేశాలతో అనేక పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందంటూ బెంగాల్ ప్రభుత్వం పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

యూపీలో దారుణం

బధిర బాలికపై అత్యాచారం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ పాలనలో అత్యాచారాలు, హత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ పాలన సాగిస్తున్నప్పటికీ శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. ప్రత్యేకించి చిన్నారులపై అత్యాచారాలు ఏమాత్రం ఆగడం లేదు. తాజాగా యూపీలోని రాంపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. 11 ఏళ్ల బధిర బాలికపై ఓ కీచకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలిక కనిపించడం లేదని కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె కోసం కుటుంబసభ్యులు గాలిస్తుండగా పొలాల్లో తీవ్ర గాయాలతో, నగ్నంగా కనిపించింది. వెంటనే ఆ బాలికను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో భాగంగా ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలు పరిశీలించగా వాస్తవాలు వెలుగుచూశాయి. దాన్ సింగ్ (24) అనే మృగాడు ఆ బాలికకు మాయమాటలు చెప్పి పొలాల్లోకి తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు అధికారులు ప్రయత్నించగా, అతడు పోలీసుల పైకి కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో నిందితుడి కాలుకి గాయమవడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆ చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ కీలక విషయాలు వెల్లడించారు. ఒకరు కంటే ఎక్కువమంది బాలికపై అత్యాచారం చేసినట్లు తెలుస్తోందన్నారు. చిన్నారి ముఖంపై బలమైన గాయాలైనట్లు వెల్లడించారు. ఆమె ప్రైవేటు భాగాలపైనా అనేక గాయాలు ఉన్నాయన్నారు. తాను చూసిన అత్యంత ఘోరమైన లైంగిక నేరాల్లో ఇది ఒకటన్నారు.

రక్షణ అడగొద్దు: హైకోర్టు

ప్రయాగ్‌రాజ్: తల్లిదండ్రులకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్న జంట... కేవలం ఆ ఒక్క కారణం చూపి పోలీసు రక్షణ కోరలేరని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. తమ జీవితానికి, స్వేచ్ఛకు నిజమైన ముప్పు ఉంటే తప్ప... వారికి భద్రత కల్పించలేమని వెల్లడించింది. జంటలు ఒకరికొకరు అండగా నిలుస్తూ సమాజాన్ని ఎదుర్కోవాలని న్యాయస్థానం సూచించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయ, కేసర్వానీ పెద్దలను ఎదిరించి తమ ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలోనే తమకు రక్షణ కల్పించడంతో పాటు తమ వైవాహిక జీవితంలో ఇతరులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఇటీవల శ్రేయ, ఆమె భర్త అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'వీరి పిటిషన్‌ను పరిశీలించిన తర్వాత ఈ జంటకు ఎలాంటి తీవ్రమైన ముప్పు పొంచి లేదని అర్థమవుతోంది. కేవలం తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకున్నంత మాత్రాన అలాంటి జంటకు పోలీసు రక్షణ కల్పించాల్సిన అవసరం లేదని గతంలో సుప్రీంకోర్టు ఇదే తరహా కేసులో తీర్పునిచ్చింది. దాని ఆధారంగా తాజా పిటిషన్‌పై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదు. ఈ కేసులో పిటిషనర్ల జీవితానికి, స్వేచ్ఛకు ప్రమాదం ఉందని చెప్పేందుకు ఒక్క కారణం కూడా లేదు. నిజంగా ముప్పు ఉండే కేసులకు మేం భద్రత కల్పిస్తాం. కానీ, అలాంటి ప్రమాదం లేనప్పుడు... సమాజాన్ని ఎదుర్కోవడం కోసం దంపతులిద్దరూ ఒకరికొకరు అండగా నిలబడాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీరి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది.

ఇఫ్తార్ వివాదంలో విజయ్‌కు ఫత్వా

చెన్నై: తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత విజయ్ దళపతికి ఆల్ ఇండియా ముస్లిం జమాత్(ఏఐఎంజే) అధ్యక్షుడు మౌలానా షహాబుద్దీన్ రజ్వీ ఫత్వా జారీ చేశారు. ఆయన సినిమాల్లో ముస్లింలను తీవ్రవాదులుగా చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ముస్లిం కార్యక్రమాలకు విజయ్‌ను పిలవకూడదని, ఆయన ఏర్పాటు చేసిన వాటిల్లో కూడా పాల్గొనవద్దని సూచించారు. మరోవైపు ఈ ఫత్వా జారీ చేయడాన్ని తమిళనాడు ముస్లిం లీగ్ నాయకుడు ముస్తఫా తీవ్రంగా ఖండించారు. 'ఒక రాజకీయ పార్టీని స్థాపించి ముస్లింలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నారు. అయితే తన సినిమాల్లో మాత్రం ముస్లింలను తీవ్రవాదాన్ని ప్రోత్సహించే వారిగా చూపించారు. తన ఇఫ్తార్ విందుకు జూదగాళ్లు, మద్యం సేవించే వారిని ఆహ్వానించారు. ఈ కారణంగా సున్నీ ముస్లింలు ఆయనపై కోపంగా ఉన్నారు. వారు విజయ్‌పై ఫత్వాను జారీ చేయాలని కోరారు. అందుకే నా సమాధానంగా, ముస్లింలు విజయ్‌తో కలిసి ఉండకూడదని సూచిస్తూ నేను ఫత్వా జారీ చేశా. ఆయనను ఏ కార్యక్రమానికి కూడా ఆహ్వానించవద్దు' అని రజ్వీ పేర్కొన్నారు. అయితే రజ్వీ ఫత్వా జారీ చేయడాన్ని తమిళనాడు ముస్లిం లీగ్ నాయకుడు ముస్తఫా ఖండించారు. రంజాన్ మాసంలో విజయ్ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ విందుకు హాజరు కావడానికి విజయ్ రోజంతా ఉపవాసం ఉన్నారు. అయితే కొన్ని రాజకీయ పార్టీల ప్రోత్సాహంతో విజయ్‌పై రజ్వీ ఇలాంటి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని ముస్తఫా అన్నారు. రజ్వీ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సీఏఏకు మద్దతు ఇచ్చిన వ్యక్తని ఆరోపించారు.

కొత్త ప్రశ్నలు అడగలేదు

ఈడీ విచారణపై రాబర్ట్ వాద్రా

న్యూఢిల్లీ: హర్యానాలోని భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా గురువారం మూడోరోజు ఈడీ విచారణకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈడీ కొత్త ప్రశ్నలేవీ అడగటం లేదని అసహనం వ్యక్తంచేశారు. 'ఈడీ అదే ప్రశ్నలు వేస్తోంది. 2019లోనూ దర్యాప్తు సంస్థ అధికారులు ఇవే ప్రశ్నలు అడిగారు. కొత్తగా ఏమీ లేదు. ఇది ఈ ప్రభుత్వం మమ్మల్ని తప్పుగా చూపించే ప్రచార శైలి. దీన్ని తట్టుకునే శక్తి మాకు ఉంది' అని వాద్రా చెప్పారు. ఈడీ చర్య తనపైనా, తన కుటుంబంపై జరుగుతున్న రాజకీయ ప్రతీకారంగా ఆయన అభివర్ణించారు. ఈ రోజు విచారణకు కూడా వాద్రా వెంట ఆయన సతీమణి ప్రియాంక వచ్చారు. ఈ కేసుకు సంబంధించి వాద్రాకు ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. గత రెండు రోజుల్లో పది గంటల పాటు ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డు చేశారు. బుధవారం విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. అదే తాను బీజేపీలో చేరి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. తాను త్వరలోనే రాజకీయాల్లోకి వస్తానని తెలిపారు. ఈడీ ప్రకారం వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

21న మోదీతో జేడీ వాన్స్ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్ భారత పర్యటన ఖరారైంది. ఈనెల 21 నుంచి 24 వరకు పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌తో కలిసి భారత్‌లో పర్యటించనున్నారు. 21వ తేదీన జేడీ వాన్స్... భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమవుతారు. భారత్ - అమెరికా సంబంధాలను బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలూ చర్చించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. 24న వారు వాషింగ్టన్ డీసీ బయల్దేరి వెళ్లనున్నట్లు పేర్కొంది.

ఈ పర్యటనలో జేడా వాన్స్ కుటుంబం... జైపూర్, ఆగ్రా సందర్శించనున్నట్లు వెల్లడించింది. సెకండల్ లేడి ఉష వాన్స్ తొలిసారి భారత్‌లో పర్యటించనున్నారు. ఆమె తల్లిదండ్రులు క్రిష్ చిలుకూరి, లక్ష్మీ చిలుకూరి 1970లో భారత్ నుంచి అమెరికాకు వెళ్లారు. ఉషా వాన్స్ అక్కడే జన్మించారు.

రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సత్వర చికిత్స

మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్రాలకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరగడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించేందుకు వీలుగా మార్గదర్శకాలను రూపొందించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఇందుకోసం ఆరు నెలల గడువును విధించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. డ్రైవర్లకు పనిగంటల విధానం అమలుపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖకు సూచించింది. 'దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో గాయపడినవారిలో చాలా మందికి సత్వరం చికిత్స అందడం లేదు. ఇంకా కొన్ని ఘటనల్లో గాయపడకపోయినా వాహనాల్లోనే చిక్కుకుపోతున్నారు. అందుకే వీరిని వేగంగా సాయం అందించే విధంగా ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నిబంధనలు రూపొందించాలి' అని సుప్రీం కోర్టు పేర్కొంది

నక్సలిజం ఇక చరిత్రే: అమిత్ షా

న్యూఢిల్లీ: దేశం నుంచి 2026 మార్చి 31వ తేదీ నాటికి నక్సలిజం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో గురువారం సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌కు చెందిన 86వ రైజింగ్ డే కార్యక్రమం జరిగింది. అమిత్ షా మాట్లాడుతూ మావోయిస్టులు కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్నార న్నారు. మావోయిస్టులను రూపుమాప డంలో... సీఆర్‌పీఎఫ్ వెన్నుముఖగా నిలిచినట్లు చెప్పారు. మావోయిస్టులను ఏరివేయడంలో సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్డ్ పోలీసు ఫోర్సెస్) తోపాటు సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్(కోబ్రా) యూనిట్... భద్రతా దళాల్లో ప్రత్యేకంగా పనిచేస్తుంది. గెరిల్లా, జంగిల్ యుద్ధాల్లో ఆ దళం ఆరితేరి ఉంది. నక్సల్స్‌ను ఎదుర్కోవడంలో కోబ్రా దళం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 400 ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీని వల్లే ఈ ప్రాంతాల్లో సుమారు 70 శాతం హింస తగ్గినట్లు చెప్పారు. ఇప్పుడు చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. దేశ భద్రత కోసం సీఆర్పీఎఫ్ చేసిన సేవలు అసాధారణమైనవని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడటంలోనైనా, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొల్పాలన్నా, మావోయిస్టులను ఎదుర్కోవాలన్నా.. సీఆర్పీఎఫ్ చేస్తున్న పోరాటం అసామాన్యమైందన్నారు. సీఆర్పీఎఫ్ సాధించిన అతి గొప్ప విజయాల్లో... నక్సలిజాన్ని పారద్రోలడమే అని తెలిపారు. ధైర్యానికి ప్రతీకగా కోబ్రా బెటాలియన్ నిలిచిందన్నారు. సీఎం మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

అలీగఢ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

అలీగఢ్ (ఉత్తర ప్రదేశ్): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)చార్జిషీట్‌ను నిరసిస్తూ గురువారం అలీగఢ్ కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈడీ చర్యలను ఖండిస్తూ బ్యానర్లు ప్రదర్శించారు. బీహార్ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

ఈ చార్జిషీట్ రాజకీయంగా ప్రేరేపించబడిందని, వేధింపులలో భాగమని మండిపడ్డారు. ఇటువంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు. కాగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వెలుపల నిరసన చేపట్టారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఈడీ చార్జిషీట్‌ను దాఖలు చేయడాన్ని వ్యతిరేకించారు.

నచ్చినట్లు చరిత్ర మార్చలేరు

బీజేపీపై నవీన్ పరోక్ష వ్యాఖ్యలు

తొమ్మిదోసారి బీజేడీ అధ్యక్ష పదవికి నామినేషన్

భువనేశ్వర్: కొందరు ఉద్దేశపూర్వకంగా మన గొప్పబిడ్డల త్యాగాలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తున్నారని ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. ఎవరికి నచ్చినట్లు వారు చరిత్రను మార్చలేరంటూ బీజేపీపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి బీజూ పట్నాయక్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన గురువారం బీజేపీ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేశారు. వరుసగా తొమ్మిదో సారి పార్టీ పగ్గాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ పదవికి ఏకైక అభ్యర్థిగా సంఖా భవన్‌లో నామినేషన్ పత్రాలు సమర్పించారు. 1997 నుంచి బీజేడీకి అధ్యక్షత వహిస్తున్న నవీన్ పట్నాయక్ చివరిగా 2020 ఫిబ్రవరిలో ఈ పదవికి ఎన్నికయ్యారు. నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మన బిడ్డల త్యాగాలను, తోడ్పాటును తక్కువ చేసేలా కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నారు. చరిత్రను మార్చాలని చూస్తున్నారు. చరిత్ర అన్నది గత అనుభవాలకు ప్రతిబింబం. దీనిని ఎవరు పడితే వారు... ఎవరికి నచ్చినట్ల వారు మార్చడం కుదరదు' ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలి' అని నవీన్ అన్నారు. 2000 నుంచి 2024 వరకు బీజేడీ పాలనలో ఒడిశా గణనీయంగా అభివృద్ధి చెందిందని, జాతీయ-అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందినదన్నారు.

ఐస్‌క్రీంపై జీఎస్టీ తగ్గించండి: ఐఐసీఎంఏ

న్యూఢిల్లీ: ఐస్‌క్రీంపై జీఎస్టీని తగ్గించాలంటూ ఇండియన్ ఐస్‌క్రీం తయారీదారుల సంఘం ప్రతినిధులు గురువారం ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిని కలిశారు. ఐఐసీఎంఏ అధ్యక్షుడు సుధీర్ షా నేతృత్వంలోని బృందం దిల్లీలోని ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజును కలిసింది. ఈ మేరకు ఐస్‌క్రీంపై ఉన్న 18 శాతం జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని కోరింది. అంతకుముందు ఈనెల 15న ఈ బృందం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసింది.

జీఎస్టీ తగ్గింపుపై ఆమెకు విజ్ఞప్తులు చేసింది. అందుకు సంబంధించిన ఫోటోను నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పోస్టు కూడా చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఏఐ సాంకేతికతతో తొలి తెలుగు జానపద గీతం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఏఐ సాంకేతికతతో తొలి తెలుగు జానపద గీతం విడుదల అయ్యింది. రోజు రోజుకీ మన జీవితంలో భాగమవుతున్న కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు మన తెలుగు జానపద గీతాలు కూడా పాడేస్తుంది. దీనిని కిన్ని మ్యూజిక్ స్టూడియోస్ అనే యూట్యూబ్ ఛానల్ సాకారం చేసింది. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిన్ని మ్యూజిక్ స్టూడియోస్ కి చెందిన కిషోర్ కుమార్ ఏనుగు రచించిన 'ఈ పిల్ల' అనే జానపద గీతం (ఫోక్ సాంగ్) ప్రోమోను విడుదల చేశారు. ఈ పాటకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిమిషాల వ్యవధిలో పాటలు సృష్టించడం సాధ్యమవుతుందని చెప్పారు. సరైన పదబంధాలతో రచించిన పాటల ద్వారా భావాలను వ్యక్తీకరించే అవకాశం లభిస్తుందని తెలిపారు. వీడియో రూపంలో, ఈనెల 18న ఉ.8 గంటలకు వారి యూట్యూబ్ ఛానల్ (కిన్ని మ్యూజిక్ స్టూడియోస్) ద్వారా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. హేమలత, సునీషా రెడ్డి ఏనుగు సంయుక్త నిర్మాణంలో రూపొందిన 'ఈ పిల్ల' అనే ఈ పాటకి హర్ష నృత్యరీతులు సమకూర్చగా, చైతన్య దర్శకత్వం వహించారన్నారు. నీరజ్ కెమెరా, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించగా, వంశీకృష్ణ, సరస్వతి చవాన్ నటించారన్నారని తెలిపారు.

మంచి నీటి సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుండిగల్: భౌరంపేట్‌లో నెలకొన్న మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించా లని మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ గ్రామ%శీ%లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు నాయకులు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నీటి సమస్యని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా భౌరంపేట్ నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారంలో ఒక్క రోజు కూడా సరిగ్గా సరఫరా కావడం లేదని ఆవేదన తెలిపారు.అనంతరం వారు సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.రెండు మూడు రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బెంబేడి బుచ్చిరెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మన్నె శేకర్ ముదిరాజ్, కటకం వీరేశ్, గోపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య దోపిడీ వర్గాల రాజ్యాలను కూల్చాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: దేశంలో ఆధిపత్యం కులాల దోపిడి రాజ్యా లను, పార్టీలను కూల్చాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు.గురువారం బీసీ కులాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని పార్టీలు ఒకే గొడుగు కింద పనిచేస్తున్నాయన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్న 90 శాతం మంది ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, రాజకీయ రంగాలలో వెనకబడి ఉన్నారన్నారు. దీనికి ప్రధాన కారణం 90 శాతం ఉన్న ప్రజలు ఐక్యత లేకపోవడమే అన్నారు. అణగారిన వర్గాల ప్రజల మధ్య ఐక్యత లేకుండా ఆధిపత్య వర్గాల వారు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారన్నారు.బిజెపి కాంగ్రెస్ పార్టీలు అగ్రకులాల నాయకత్వంలో పనిచేస్తున్నాయన్నారు. రాజ్యాధి కారం కొరకు రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు దండు కట్టా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జన చైతన్య వేదిక రాష్ట్ర యువత అధ్యక్షుడు బోయినీ మహేష్ యాదవ్,బీసీ జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు అంకం గోపాల్ యాదవ్, అంజనేయులు, మాసయ్య, నాగేష్, రమేష్, వీరాంజనేయులు ముదిరాజ్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మమతా మెడికల్ కళాశాలలో అరుదైన శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : 50 సంవత్సరాలు గల ఎల్లమ్మ పేషెంట్‌కి మమత హాస్పిటల్ నందు అతి క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ఆమెను డాక్టర్ల బృందం కాపాడారు. ఎల్లమ్మ అస్వస్థతకు గురై పలు హాస్పిటల్లో తిరిగినా,అక్కడ ఓవరీస్ కి అతిపెద్ద ఒవేరియన్ సిస్ట్ ఉందని నిర్ధారించారు. తదనంతరం శస్త్రచికిత్స చేయవలసి వస్తుందని తెలిపారు.హాస్పిటల్లో తనకి హైరిస్కు ఉందని గుండె సమస్య ఉండటం వల్ల శస్త్రచికిత్స చేయడం కష్టమని చెప్పి పలు హాస్పిటల్స్ డాక్టర్స్ నిరాకరించారు.తరువాత మమతా హాస్పిటల్ బాచుపల్లి నందు డాక్టర్ మైత్రి దగ్గరికి ఎల్లమ్మ రావడం జరిగిందని,డాక్టర్ మైత్రి వారి టీం పూర్తి ఎబ్డోమినల్ హై స్టెరాటమి,బిలాటరీల్ సెల్ఫిన్గో ఓపిహెరాటమి శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడగలిగామని డాక్టర్లు తెలిపారు.ఈ శస్త్ర చికిత్సకు మత్తు విభాగం నుండి డాక్టర్ రాజశేఖర్,డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భువన్, కార్డియాలజీ విభాగం నుండి డాక్టర్ సాంబశివరావు, వారి బృందం సహాయపడ్డారు.ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు మమతా హాస్పిటల్ నందు సామాన్యులకు అందుబాటు ధరలో లభించడం ఆనందకరమని అన్నారు.డాక్టర్ల బృందం డాక్టర్ నవీశ్వర్,డాక్టర్ ధీరజ్, డాక్టర్ అనిరుద్,డాక్టర్ ప్రణీత్ అడ్మిన్ విభాగం నుండి మాట్లాడుతూ తమ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నయన్ మమతా హాస్పిటల్ నందు సామాన్యుడికి అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రజలందరికీ ఉపయోగపడాలని కోరారు.శస్త్రచికిత్స విభాగంలో డాక్టర్ మైత్రి, డాక్టర్ శైలజ, డాక్టర్ ఆమని, డాక్టర్ ఉషా నాగ్ ఉన్నారు.

నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి కావాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ నెల 30 లోగా వంద శాతం పురోగతి సాధించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ జిల్లా కలెక్టర్లకు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

గురువారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్, డిటిసిపి దేవేందర్ రెడ్డితో కలిసి ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్‌లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా తక్కువ ప్రోసిడింగ్‌లు జారీ చేసిన జిల్లా కలెక్టర్లతో ముఖ్య కార్యదర్శి మాట్లా డారు. అదేవిధంగా ఎక్కువ ప్రోసీడింగులు జారీచేసిన జిల్లా కలెక్టర్లు తాము అనుసరిస్తున్న వ్యూహాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులు అందరికీ ప్రొసిడింగ్ జనరేట్ వేగంగా చేయాలన్నారు. ఓపెన్ ప్లాట్లతో పోల్చుకుంటే లే అవుట్ ల వెరిఫికేషన్ ఆశించిన వేగంగా జరగడం లేదని ముఖ్య కార్యదర్శి తెలిపారు. ఓపెన్ ప్లాట్ తో పాటు లే ఔట్ ల వెరిఫికేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలనీ కలెక్టర్ లు, కమిషనర్ లకు సూచించారు.బల్క్ అప్లికేషన్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు ఆయన సూచించారు.

ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులకు మళ్ళీ ఫోన్ చేసి ఏప్రిల్ 30 లోగా ఫీజులు చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

ఫీజులు చెల్లించిన ప్రోసీడింగ్స్ అందని పరిస్థితి... ఎల్ఆర్ఎస్ దరఖాస్తురులు తమకు ఫీజు ఇంటిమేషన్ వచ్చిన క్రమంలో ఫీజులు చెల్లించినప్పటికీ ప్రొసీడింగ్స్ మాత్రం రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఫీజులు చెల్లించిన సైట్ ఇన్స్పెక్షన్ లో పేరుతో కిందిస్థాయి అధికారులు కాలయాపన చేస్తున్నటు వంటి పరిస్థితి నెలకొంటుంది. దరఖాస్తుదారులు ప్రభుత్వానికి ఫీజులు చెల్లించాలని ఆలోచనలో ఉన్నప్పటికీ కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి రావలసిన డబ్బు రాకుండా పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి పనులపై గాంధీ సమీక్ష

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, అధికారులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమిష్టి కృషి తో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు. చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని , కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పనులలో వేగం పెంచాలని సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడలని , అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, రోడ్లు, డ్రైనేజి, మంచినీటి వసతి, విధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయాలని అవసరమున్న చోట యుద్ధప్రాతిపదికన రోడ్లు వేయాలని తెలియచేశారు.అంతర్గత రోడ్ల ను త్వరితగతిన పూర్తి చేయాలని, కాలనీలలో పూర్తి స్థాయిలో రోడ్ల ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. రాబోయే వర్షాకాలం లోపు నాలల విస్తరణ పనులను వేగవంతం చేయాలని , పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాకాలం లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నాలల పూడికతీత పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు గాంధీ గారు తెలియచేశారు. ప్రజలకు ఎల్లవేళలలో అందుబాటులో ఉండి,క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా పని చేయాలని, అన్ని కాలనీ లను సమగ్ర అభివృద్దే ధ్యేయంగా పని చేయాలని, కాలనీ లలో చేపడుతున్న పనులలో వేగం పెంచాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ జీకెడీ ప్రసాద్, ఈఈ ఇంద్ర బాయి, డీఈ దుర్గ ప్రసాద్, డీఈ విశాలాక్షి, డీఈ శ్రీదేవి, ఏఈ జగదీష్, ఏఈ ప్రశాంత్, ఏఈ రషీద్, ఏఈ ప్రతాప్, ఏఈ సంతోష్ , ఏఈ సంతోష్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితి సంబరాలకు జర్నలిస్టు దుడ్డేల రవీందర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-జవహర్ నగర్: మే నెలలో జరుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో జరుగు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల పట్టాభిషేక మహోత్సవానికి కవి,రచయిత, గాయకులు,జర్నలిస్టు రవీందర్ దుడ్డేల (చెదర)కు ఆహ్వానం పంపారు.నిర్వాహకులు ఎంతో కాలంగా సామాజిక స్పృహతో ప్రజలను మేల్కొల్పే కవిత్వాలు రాస్తున్న రవీందర్ ను ప్రపంచ శ్రీ కళావేదిక గుర్తించి ఈ ఆహ్వానాన్ని ఆయనకు పంపారు.తెలుగు భాష మాండలికం పై బలమైన పట్టు గల రవీందర్ ఏ విషయంపైనైనా తన కలంతో కవిత్వంతో స్పందించడం చెప్పుకోదగ్గ విషయం.ఈ సాహితీ సంబరాల మహోత్సవంలో రవీందర్ రాసిన కవితలు ఎంపికైనట్లయితే ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీ శ్రీ కళా వేదిక అధికారిక బిరుదులు కట్టపెట్టే అవకాశం ఉంది.

తెలుగు వర్శిటీలో పుస్తక ప్రదర్శన గడువు పొడిగింపు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణం ప్రచురణల విక్రయశాలలో వర్శిటీ ప్రచురించిన పుస్తకాలను ప్రత్యేక రాయితీతో విక్రయిస్తున్న పుస్తక ప్రదర్శనను పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలియజేశారు. ఈ నెల 17తో ముగిసిన ప్రత్యేక రాయితీ విద్యా ర్థులు, పుస్తక విక్రేతలు, పాఠకాభిమానులు మరికొన్ని రోజులు పొడిగించవ లసిందిగా కోరినందున ఈ నెల 30 వరకు కొనసాగనున్నట్లు, అన్ని పుస్తకాలపై 60 శాతం వరకు ప్రత్యేక రాయితీతో ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సాహితీప్రియులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విశ్వవిద్యాలయం ప్రచురణలలో ప్రాచీన గ్రంథాలు, భారత భాగవత ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతహాసాలు, చరిత్ర గ్రంథాలు, సాహిత్య నిఘంటువులు, సంగీత నృత్య పాఠ్యగ్రంథాలతోపాటు పరిశోధన గ్రంథాలు అందుబాటులో ఉన్నాయని ఈ సదావకాశాన్ని సాహిత్యాభిమానులు వినియోగించుకోవాలని రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు తెలిపారు.

భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో :భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం తాడ్వాయి మండలం కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమము లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.భూభారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు ఒక్కొక్క సెక్షన్, అంశం వారీగా ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని అన్నారు. భూ భారతితో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూసమస్యలు పరిష్కారం కానున్నాయని అన్నారు.ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసిల్దార్ సురేష్, , ఎంపిడిఓ సుమన వాణి, వివిధ వర్గాల ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వడగండ్ల బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - మహబూబ్ నగర్ : వడగండ్ల వర్షం వల్ల పంట నష్టం జరిగిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం రాజాపూర్ మండల పరిధిలో గల గుండ్ల పొట్లపల్లి గ్రామంలో అకాలవడగళ్ల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, వరి, కూరగాయల తోటలు పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాలకిషన్ కోరారు. 15వ తేదీన నాడు భారీగా వనగండ్ల వర్షం కురవడం వల్ల నష్టపోయిన పంటలను చూశారు ఆయన మాట్లాడుతూ ఒక ఎకరానికి మొక్కజొన్నకు పెట్టుబడి ఖర్చు 25 నుంచి 30 వేల వరకు, వరి ఎకరానికి పెట్టుబడి ఖర్చు 30 వేల వరకు వస్తుందన్నారు. ఇప్పుడు వనగండ్ల వర్షం వల్ల పూర్తిగా పంట నష్ట పోవడం జరిగిందని వివరించారు. కావున ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక ఎకరానికి మొక్కజొన్నకు 40వేల రూపాయలు, వరికి 50వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి కృష్ణ యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి సత్యనారాయణ రెడ్డి, మాడెమోని ఆంజనేయులు, రైతులు యాదగిరి, ఎం గోవర్ధన్, కే మహేష్, ఆకుల నర్సింలు, హనుమంతు, శ్రీను పాల్గొన్నారు.

మెట్రో చార్జీల మోతకు సిద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నష్టం పేరుతో మెట్రో చార్జీలను పెంచేందుకు ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సంస్థ రూ.6500కోట్ల భారీ నష్టాల్లో వున్నట్లు మెట్రో సంస్థ పేర్కొంది. కోవిడ్ సమయంలో ఎల్అండ్‌టీ సంస్థ తీవ్రంగా నష్టపోయామని ఈ నేపథ్యంలో అప్పటి నుండి కూడా చార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. అయితే గత ప్రభుత్వం మెట్రో చార్జీల పెంపు విషయంలో సుముఖత చూపకపోవడంతో అది వాయిదా పడుతూ వచ్చింది. కాని ప్రస్తుత పరిస్థితుల్లో చార్జీలు తప్పదని సంస్థ వెల్లడిరచింది. ఈ నేపథ్యంలో ఇటీవల బెంగళూరులో 440శాతం మెట్రో చార్జీలు పెంచడంతో హైదరాబాద్‌లో కూడా చార్జీలను ఎంత పెంచాలనే యోచనలో ఎల్అండ్‌టి మెట్రో సంస్థ ఆలోచిస్తుంది. ఇప్పటికే ఎల్ అండ్‌టీ సంస్థ నష్టాల పేరుతో గతంలో వున్న రూ.59 హాలిడే సేవకర్ కార్డును రద్దు చేయడంతో పాటు మెట్రో పై రద్దీ వేళల్లో 10శాతం రాయితీని కూడా ఎత్తివేసింది.

భూ భారతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు అదనపు కలెక్టరు విదయేందరర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టరు గౌతం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆర్ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. 1989 ఆర్ఓ ఆర్ చట్టం లోని అంశాలు భూభారతి లోని అంశాలు కొంత వరకు సిమిలర్ గా ఉన్నాయని, అంతే కాకుండా రెవెన్యూ అధికారులకు ధరణీలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు. ఈ అధికారాలతో రెవెన్యూ అధికారుల పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రతిది ఆన్ లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టరు అధికారులకు సూచించారు.రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసిడింగ్స్ ద్వారా మాన్యువల్ గా నిర్వహించాలని, నూతన మార్గదర్శకాలతో సమ్మతించడం, తిరస్కరించడం చేయలని కలెక్టరు స్పష్టం చేసారు. ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యతులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని,భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. అంతే కాకుండా భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని కలెక్టరు సూచించారు. ఈ నెల 19 నుండి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని ఈ సదస్సుల ద్వారా భూభారతి చట్టం పై ప్రజలకు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, డిప్యూటీ కలెక్టరు వంశీ మోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాతృ సంస్థలో చేరిన రాయబండి

విశాలాంధ్ర-హైదరాబాద్ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివ రావు సమక్షంలో రాయబండి పాండురంగా చారి తిరిగి మాతృ సంస్థలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పాండురంగ చారి తిరిగి పార్టీలో రావడం మంచి పరిణామంగా అని అన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని తెలిపారు.

మీర్ నసీర్ అలీఖాన్‌కు అవార్డు ప్రదానం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: భారత్, కజకిస్తాన్ దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, సాంస్కృతిక సంబంధాలు మెరుగుపరచడంలో డాక్టర్ నవాబు మీర్ నసీర్ అలీఖాన్ చేసిన కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక 2024 - 25 ఏషియావన్ డిప్లొమాటిక్ ఎక్సలెన్స్? అవార్డును ప్రదానం చేశారు. ఈయన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు హైదరాబాద్‌లో కజకిస్తాన్ రిపబ్లిక్ గౌరవ కాన్సల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ అవార్డును సౌదీ అరేబియా, ఇండియా, థాయిలాండ్ 20 సమ్మిట్ (ఎస్ఐటీ20) సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 25వ ఏషియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్‌లో ఇచ్చారు. ఈ అవార్డును డాక్టర్ అలీఖాన్ తరపున ఢిల్లీలోని కజకిస్తాన్ రాయబార కార్యాలయం రెండో కార్యదర్శి, సీనియర్ దౌత్యవేత్త యెర్మెక్ ఐట్మాగంబెటోవ్ స్వీకరించారు. డాక్టర్ అలీఖాన్ భారత్, కజకిస్తాన్ మధ్య రాజనీతి సంబంధాలను బలోపేతం చేయడంలో, కొత్త సహకార అవకాశాలు అన్వేషించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆకాష్ హెల్త్?కేర్, ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు డాక్టర్ జేసీ చౌదరి, ఆకాష్ హెల్త్?కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (ద్వారక) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి డబుల్ హార్స్ గ్రూప్‌నకు అవార్డు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెనాలి డబుల్ హార్స్ గ్రూప్‌నకు మరో గౌరవించదగిన గుర్తింపు లభించింది. యూఆర్ఎస్ మీడియా మరియు ఆసియా వన్ మ్యాగజైన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 25వ ఆసియన్ బిజినెస్, సోషల్ ఫోరమ్ కార్యక్రమంలో, సంస్థకు ఇండియాస్ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ బ్రాండ్స్, లీడర్స్ 2024-25 అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మునగాల మోహన్ శ్యాం ప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ మునగాల మోహన్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ గౌరవం తెనాలి డబుల్ హార్స్ కుటుంబానికి మాత్రమే కాక, మాతో కలిసిన ప్రతి వినియోగదారుడు, డిస్ట్రిబ్యూటర్, భాగస్వామి నమ్మకానికి అద్దంపడుతోందన్నారు. ఈ గుర్తింపు మా ప్రయాణంలోని ఓ మైలురాయి. ఇది తెనాలి అనే చిన్న పట్టణం నుండి ప్రపంచ స్థాయిలో విశ్వసనీయత సంపాదించిన మా ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ గౌరవాన్ని మా బృందం, రైతులు, వ్యాపార భాగస్వాములు మరియు మా మీద నమ్మకాన్ని ఉంచిన ప్రతి వినియోగదారుడికి అంకితం చేస్తున్నాము. మేడ్ ఇన్ తెనాలి, మేడ్ ఫర్ ది వరల్డ్" అన్న సిద్ధాంతంతో మా ప్రయాణం కొనసాగుతుంది. " అని మోహన్ శ్యాం ప్రసాద్ అన్నారు. డబుల్ హార్స్ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో, అంతర్జాతీయంగా 12 దేశాల్లో లభ్యం. అమెరికా, కెనడా, గల్ఫ్ దేశాల్లో సంస్థ గణనీయమైన మార్కెట్‌ను సంపాదించుకుంది. 2,200కిపైగా డిస్ట్రిబ్యూటర్లు, 2.5 లక్షల రిటైల్ స్టోర్లతో మిలియన్ల మంది వినియోగదారులకి చేరువైంది.

ఏసీపీ కట్ట హరి ప్రసాద్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : కేరళలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ -2025 లో టేబుల్ టెన్నిస్ పోటీలలో డబుల్స్, మిక్స్ డబుల్స్ విభా గంలో రెండు కాంస్య పతకాలు సాధించిన వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసిపి కట్ట హరి ప్రసాద్‌కు ఎస్ హెచ్ ఓ లు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర-మొయినాబాద్: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ సూచించారు. గురువారం నుంచి నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో బాగంగా మొదటి రోజు మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో పాడిపశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని టీకాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజు నుంచి వచ్చే నెల 15వ తేది వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయడం జరుగుతుం దని చెప్పారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడి పశువులకు (ఆవులకు, గేదెలకు) టీకాలు వేస్తారని దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నుంచి తమ పశువులను కాపాడుకునేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. పాడి రైతులు సహకరించాలని సూచించారు. మొదటి రోజు సురంగల్ గ్రామంలో 192 పశువులకు టీకాలు వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావు, ఘోరమియా రైతులు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి : రాజ్ కుమార్

పశ్చిమ బెంగాల్లో హిందువులపై దాడులు అరికట్టలేని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తక్షణమే రద్దుచేసి, రాష్ట్రపతి పాలన విధించాలని బిజెపి నగర కార్యవర్గ సభ్యులు డా.వై.రాజ్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మమతా బెనర్జీ నిర్వహించిన బహిరంగ సభలో హిందువులపై దాడులను ఉసిగొలిపే విధంగా ముస్లింలు రెచ్చగొట్టడం సిగ్గుచేటు అన్నారు. ముర్షిదాబాద్ లోని హిందువులు మానప్రాణాలు కాపాడడం కోసం వలస వెళ్లడం బాధాకరమన్నారు. దాడులకు పాల్పడుతున్న సంఘవిద్రోహశక్తులపై ఉక్కు పాదం మోపాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర- మేడిపల్లి: పీర్జాది గూడ నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్లో మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్ తో కలిసి స్థానిక కాలనీ వాసులతో గురువారం ఉదయం ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, పనుల నాణ్యతను, అడిగి తెలుసుకున్నారు. స్థానిక కాలనీ వాసుల అభిప్రాయాలను సేకరించి, వారి సమస్యలను విన్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతతో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పెషల్ టూరిస్ట్ ప్యాకేజ్ ట్రైయిన్

విశాలాంధ్ర-హైదరాబాద్ : సమ్మర్ స్పెషల్ టూరిస్ట్ ప్యాకేజ్ ట్రైయిన్ "భారత్ గౌరవ్ టూర్స్" (బిజిటి) ను ఇండియన్ రైల్వే శాఖ చేపట్టిందని జాయింట్ జనరల్ సెక్రటరీ టూరిజం డిఎస్ జి పి కిషోర్ తెలిపారు. ఈ ప్రయోజనం ద్వారా భారతదేశంలోని ప్రధాన పర్యాటక అలాగే యాత్రా స్థలాలను ప్రత్యేక రైళ్ల ద్వారా సందర్శించే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ప్యాకేజీలలో రైలు ప్రయాణం, బస్సు ప్రయాణం, హోటల్, భోజనాలు అలాగే గైడ్ సేవలు కూడి ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు హైదరాబాద్ సికింద్రాబాద్ రైల్వే శాఖలను సంప్రదించాలని అయన పేర్కొన్నారు.

శాంతినికేతన్‌లో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-మల్కాజి గిరి : గౌతమ్ నగర్ డివిజన్‌లోని వెంక టేశ్వర నగర్‌లోని శాంతినికేతన్ హైస్కూల్‌లో జరిగే కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డేకు గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు పట్టబద్రులు అయి అలరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ చిన్నారులు కొత్త దశలోకి అడుగుపెడుతున్నందుకు అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నక్సల్స్ ప్రాంతాల ఆదివాసీలకు మౌలిక సౌకర్యాలే లక్ష్యం : ఎస్పీ

విశాలాంధ్ర - చర్ల : మావోయిస్టు ప్రభావిత మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి ప్రజలకు విద్యా వైద్యం రవాణా లాంటి సౌకర్యాలు కల్పించేందుకు విస్తృతంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఈ క్రమంలో చర్ల మండలంలోని పూసుగుప్ప నుండి చత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన రెండు కిలోమీటర్ల బీటి రోడ్డును గురువారం ఆయన సందర్శించారు. చర్ల నుండి ఆయన ద్విచక్ర వాహనాల ద్వారా ప్రయాణించి కాజ్ వే లు, కల్వర్ట్ ల పనులను పరిశీలించారు. అనంతరం పూసుగుప్ప చేరుకొని బీటీ రోడ్డును సందర్శించారు. సుమారు రూ. 3 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఈ రోడ్డు చత్తీస్గఢ్ లోని రాంపురం, భీమారం గ్రామాలలో నివసించే ఆదివాసి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆదివాసి ప్రజలను అభివృద్ధికి దూరం చేయాలని మావోయిస్టులు చూస్తున్నారని ఎస్పీ విమర్శించారు. అతి త్వరలోనే పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాలలో దాదాపుగా పూర్తయిన మొబైల్ హాస్పిటళ్లను ప్రారంభించనున్నామని చెప్పారు. అదేవిధంగా ఆదివాసీ ప్రజలకు ఉపయోగపడే ఏ అభివృద్ధి కార్యక్రమాన్నైనా ముందుండి పూర్తి చేయడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పాలసీకి ఆకర్షితులై ఉవిధ క్యాడర్ల మావోయిస్టు చాలామంది ఇప్పటికే లొంగిపోయారన్నారు. మిగిలిన నాయకులు, సభ్యులు కూడా లొంగిపోయి ఆదివాసీల అభివృద్ధికి సహకరించాలని ఎస్పీ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సిఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్రాంతానికీ విస్తరించిన స్టెర్లింగ్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మహారాష్ట్రలోని టిపేశ్వర్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో స్టెర్లింగ్ హాలిడే రిసార్ట్స్ అత్యాధునిక లగ్జరీ వైల్డ్ లైఫ్ రిసార్ట్‌ను ఘనంగా ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ప్రాముఖ్యమైన అటవీ ప్రాంతాల్లో 14 రిసార్టులను స్థాపించి, స్టెర్లింగ్ ఇప్పుడు భారతదేశంలోని ప్రముఖ వైల్డ్ లైఫ్ హాస్పిటాలిటీ బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది.

ఎన్ హెచ్ 44 హైవేపై ఉన్న స్టెర్లింగ్ టిపేశ్వర్‌కు నాగ్‌పూర్ (3.5 గంటలు), హైదరాబాద్ (5 గంటలు) నుంచి సులభంగా చేరుకోవచ్చు. పెద్ద అభయారణ్యాల్లా కాకుండా, టిపేశ్వర్‌లో సందడి తక్కువగా ఉండి, పులుల ప్రత్యేక దృశ్యాలను చూసే అవకాశాన్ని ఇస్తుంది. ఇది భారతదేశంలోని అత్యంత భద్రంగా ఉండే వన్యప్రాణి గమ్యస్థానాలలో ఒకటి. ఏడెకరాల్లో విస్తరించి ఉన్న స్టెర్లింగ్ టిపేశ్వర్, సుస్థిరతతో కూడిన సొగసును అందిస్తుంది. అతిథులు కళాత్మకంగా రూపొందించిన సఫారీ గుడారాలు, విల్లాల మధ్య ఎంపిక చేసుకోవచ్చు. ఇవన్నీ స్థానిక వన్యప్రాణుల స్ఫూర్తితో రూపొందించబడి, అడవుల్లో విహరించేందుకు ప్రైవేట్ సిట్ అవుట్‌లను కలిగి ఉంటాయి. నక్షత్రాల కింద ఏర్పాటు చేసే వ్యక్తిగత బార్బెక్యూలు ప్రత్యేక అనుభూతిని ఇస్తాయి. రిసార్ట్ లోని ప్రధాన ప్రాంతమైన "అడవి"లో 50కి పైగా పళ్ల చెట్లు, ఆకర్షణీయ పక్షులు, ఈ ప్రాంత పర్యావరణ వ్యవస్థను మనకు దగ్గర చేస్తాయి. గైడెడ్ సఫారీలు, ప్రకృతి నడకలు, టిపేశ్వర్ ప్రఖ్యాత గోల్డెన్ టైగర్ 'ఫాంటమ్ పాస్' కథలతో నేచురలిస్టులు వినూత్న కార్యక్రమాలు అందిస్తారు.

ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర సమితి పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్ : మే 15-18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం హిమాయత్ నగర్ లోని సత్యనా రాయణ రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా లిఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలి లు సంయుక్తంగా మాట్లాడుతూ భారతదేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో నిరుద్యోగ సమస్య అధికమయిందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడం మూలంగానే దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవడం లేదని వారు విమర్శించారు. ఉపాధి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించలేవని వారు అన్నారు. పాలకులు ఎంతసేపటికీ ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబ డిదారీ వ్యవస్థలపైనే ఆధారపడటం ద్వారా దేశ ఆర్థిక సమతుల్యత సాధ్యం కాదని వారు అన్నారు. ఈ చర్యల మూలంగా దేశంలో గత 10సంవత్సరాలుగా వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయని, దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగ సైన్యం పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే 2025 మే 15-18వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి నగరంలో జరగనున్నా యని, ఈ మహాసభలలో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశా లపై బోధనలు, చర్చలు,తీర్మానాల ద్వారా నిర్ణయాలు ఉంటాయని, ఈ జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుండి సుమారు 800మంది డెలిగేషన్ నాయకత్వం పాల్గొంటారని వారు అన్నారు.తెలంగాణ రాష్ట్రం నుండి 80మంది డెలిగేషన్ పాల్గొంటున్నట్లు, మే15 న తిరుపతి లో జరగనున్న మహాసభల ర్యాలీ, బహిరంగ సభకు 1000మంది పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు,లింగం రవి,బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్,పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్,షేక్ మహమూద్,శివ కుమార్,మధు,బోనగిరి మహేందర్, మస్క సుధీర్, మహేష్, మాజీద్ అలీ ఖాన్,కళ్యాణ్, మానస్ కుమార్,మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్,వెంకటేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి జయంతి

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పోలింగ్, కౌంటింగ్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఉదయం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓ లకు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్ లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ... పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనల పై పూర్తి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో సజావుగా జరిగేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సాధారణమే అయినప్పటికీ అజాగ్రత్తగా ఉండవద్దని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఎవరి బాధ్యతలు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ మొదలు పోలింగ్ ముగిసే వరకు చేయాల్సిన ప్రక్రియను ఆయన వివరించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్, బ్యాలెట్ బాక్స్ ఓపెన్, సీల్ తదితర అంశాలపై పూర్తి సుశిక్షితులై ఉండాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిబంధనల ప్రకారం జరగాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా కౌంటింగ్ సిబ్బంది పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలోని అన్ని విషయాలను సమగ్రంగా అవగాహన చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో భాగంగా పోలింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ మెటీరియల్స్, బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ చెక్ చేసుకోవడం, ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, సంబంధిత ఫారాలు పూరించడం, ప్రిసైడింగ్ అధికారి అధికారాలు, విధులు, పోలింగ్ అధికారుల విధులు తదితరాలను మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియలో నిర్వర్తించాల్సిన విధులు, నియమ నిబంధనలను కౌంటింగ్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రెనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి (పి.ఓ యు.సి.డి), మమత (ఈ ఈ ఎలక్ట్రికల్), పోలింగ్ పిఓ లు, ఏపిఓ లు, మైక్రో అబ్జర్వర్, ఓపిఓలు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్స్ లు, మైక్రో అబ్జర్వర్ లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ లక్ష్యం: వెన్నెల

విశాలాంధ్ర - అమనగల్లు: రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, టీపీసీసీ సభ్యుడు అయిల్లా శ్రీనివాస్ గౌడ్, ఇంచార్జ్ శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మాజీ జడ్పిటిసి శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిపరిక్షణ పాదయాత్ర నిర్వహించి, గ్రామంలో వాడ వాడ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాడని, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. గాంధీ శాంతి సందేశం, అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాటం, రాజ్యాంగ విలువలను ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, మాజీ సర్పంచులు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, వెంకటరమణారెడ్డి, బలరాం, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, మాజీ ఉప సర్పంచ్ కొప్పు శేఖర్ గౌడ్, అంజన్ రెడ్డి, ఎన్ఎస్ఈయూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ప్రసాద్, మాజీ యూత్ మండల అధ్యక్షుడు అండేకార్ రాజు, వెంకట్ రెడ్డి, దేవరశెట్టి మహేష్, విజయ్ రాథోడ్, షాబోద్దీన్, బాలు, గోవింద్, కొండయ్య, షఫీ, నర్సింహా, బుచ్చయ్య, చిన్న, కృష్ణయ్య, రాజు, అఫ్రోజ్, శ్రీను, డిగ్రీ కృష్ణ, పులికంటి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ

విశాలాంధ్ర ఖమ్మం/నేలకొండపల్లి: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు.

గురువారం నేలకొండపల్లి మండలం నాచేపల్లి రైతు వేదికలో చేపట్టిన రెవెన్యూ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని పోగొట్టేందుకు ,జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, ఆర్ఓఆర్ మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్య లు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతిలో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యూటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులను మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం చట్టంలో ఉందన్నారు. సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 113 దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సందర్శించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి, పాలేరు నియోజక వర్గ ఇంచార్జ్ అధికారి ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజల్లో ఐకమత్యం, సోదరభావం : ఎస్ఐ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : శతాబ్దాల నుంచే ఈ పుణ్యభూమి భారతదేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి స్వభావం, సోదర భావం సహజంగా ఉన్న లక్షణాలని 2 టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ సిల్వరాజ్ అన్నారు. ప్రపంచం వ్యాప్తంగా ఏ దేశంలో లేని సంస్కృతి సాంప్రదాయాలు, భిన్నత్వంలో ఏకత్వం కేవలం భారతదేశంలో మాత్రమే ఉందన్నారు.

కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి జీవించడం లోనే ఆనందం, సామజిక ప్రగతి దాగి ఉందన్నారు. బుధవారం రాత్రి రామవరం పట్టణంలోని మాస్జిద్ లో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాప్ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన సమాజం లో శాంతి సామరస్యం వెల్లివిరియాలంటే మన పూర్వికుల్లాగా మనం కూడా పరస్పర సోదరభవం, గౌరవించుకునే సంస్కృతి ఉండాలని సిల్వ రాజ్ కోరారు. మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే అన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ విశ్వాసాలకు అనుగుణంగా జీవిస్తూ ఇతరుల విశ్వాసాలను కూడా గౌరవించాలని అప్పుడే ఐక్యత ఉంటుందన్నారు. విశ్వ హిందు పరిషత్ సినియర్ సభ్యులు కొదమ సింహం పాండురంగ చార్యులు మాట్లాడుతూ హిందూ ముస్లిం భాయి భాయి గా కలిసి మెలిసి ఉండే ప్రాంతాల్లో కొత్తగూడెం ఆదర్శప్రాయం అన్నారు. ఇక్కడ ఎంతమంది తమ మధ్య ఐక్యతను దెబ్బతీయాలనుకున్న విఫలమయ్యారని ఆయన గుర్తు చేశారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ దశాబ్దాలను నుంచి అన్ని వర్గాలను కలుపుకొని పోతూ ఐక్యత కోసం సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన అభినందించారు.

జమాత్ జిల్లా అధ్యక్షుడు షారుఖ్ యాజ్దాని మాట్లాడుతూ రంజాన్ మాసం లో మానవాళికి మార్గదర్శి ఖురాన్ అవతరించిన మాసం అన్నారు. పండగ సందర్భంగా ఈద్ ముబారక్ నిర్వహిస్తుంటామని చెప్పారు. ఏ ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఫహీం దాదా మాట్లాడుతూ బిన్న సంస్కృతులకు నిలయమైన భారత దేశంలో కిన్ని దుష్ట శక్తులు స్వార్ధ రాజకీయాలకోసం హిందూ- ముస్లింల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నాయన్నారు. ఈ పరిణామాలను అర్ధం చేసుకొని హిందూ ముస్లింలు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేఖ్ అబ్దుల్ బాసిత్, సుధాకర్, నారాయణ మసీదు కమిటీ అధ్యక్షుడు జైనులాబుద్దీన్, కలీం, మస్తాన్, అఫ్జల్, మౌలానా రహ్మతుల్లా హుస్సేనీ, రబ్బానీ, ఇర్ఫాన్, సమీర్, అధిక సంఖ్యలో స్త్రీ, పురుషులు పాల్గొన్నారు.

గ్రామ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో-మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం మేడ్చల్, షామీర్ పేట్ మూడుచింతపల్లి, మండలంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయిలు ఉన్న 5 నెలల జీతం వెంటనే ఇవ్వాలి డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ..... ఐదు నెలల జీతం లేకుండా కార్మికులు ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. రోజు వారు ఖర్చులకు స్కూల్ ఫీజు ఇంటికి రాయి నిత్య అవసరాల సరుకులు కొనాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఐదు నెలలు గడవడం అంటే ఎంత ఇబ్బంది పెడుతున్నారని ఆలోచించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు గాని ఎమ్మెల్యేలు గాని ఐదు నెలలు జీతాలు తీసుకోకుండా పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి రోజు నేను దళితుల కోసం కష్టపడుతున్నానని చెప్పిన ముఖ్యమంత్రి దళితులైన గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల జీతాలు ఇవ్వడం మర్చిపోయారని వెంటనే ఐదు నెలలు పెండింగ్లో ఉన్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు రాష్ట్రంలో ఏ అధికారి అయినా జీతాలు లేకుండా పనిచేస్తున్నారా...? ఏ అధికారిని అడిగిన పని చేయమని చెప్తున్నారే తప్ప జీతాలు కొరకు ఎవరు చెప్పడం లేదు... ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ గ్రామ పంచాయతీ కార్మికుల నాయకులు సుధాకర్, ఆరోగ్యం, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మతో పాటు గ్రామ పంచాయతీ కార్మికులు హాజరయ్యారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: 2025-26 సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ పి. మోహన్ రెడ్డి కోరారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో రెవిన్యూ విభాగం తొ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉప కమీషనర్ మాట్లాడుతూ.. ఏఎంసీలు, టాక్స్? ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఏప్రిల్ నెల ముందస్తు లక్ష్యమైన 64.41 కోట్లు (ఎర్లీ బర్డ్? పథకం ద్వారా)వసూలు చేయాలని, సెలవు రోజులలో కుడా ఆస్థి పన్ను వసూలు చేయాలని అదేశించారు. గృహస్తులు ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను 5 శాతం రాయితీతో ముందస్తుగా చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకొని తమ గృహ, వాణిజ్య ప్రాంతాలకు సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించాలని కోరారు. ఈనెల 1వ తేదీ నుంచి ఎర్లీ బర్డ్? పథకం ప్రారంభమైందని, ఈనెల 30 వరకు మాత్రమే ముందస్తు పన్ను చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. 2024-%-%25 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తులపై ఎలాంటి బకాయిలు లేకుండా పన్ను పూర్తిగా చెల్లించిన వారు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్? పథకానికి అర్హులు అని ఉప కమీషనర్ గారు తెలిపారు. శుక్రవారం, శనివారం, ఆదివారం మరియు ఏప్రిల్ నెలలోని అన్ని సెలవు రోజులలో బిల్ కలెక్టర్ అందుబాటులో ఉంటారని, సర్కిల్ ఆఫీస్ సిటిజన్ సర్వీస్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటుందని, ఫోన్ పే, గూగుల్ పే, క్రెడిట్ కార్డ్?, మీ సేవా సెంటర్ల లొ ఆస్థి పన్ను చెలించుకోవచ్చని, ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా చందానగర్ సర్కిల్ ప్రజలకు ఉప కమిషనర్ పి. మోహన్ రెడ్డి కోరడమైనది. ఈ సమావేశం లొ ఏఎంసి మహేందర్ రెడ్డి, టాక్స్? ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన సందీప్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-ఖమ్మం: క్షయ వ్యాధి నివారణ లక్ష్యంగా పనిచేస్తున్న మధిర ట్రీట్మెంట్ యూనిట్ నందు విధులు నిర్వహిస్తున్న సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఎన్ సందీప్, మరియు సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ సూపర్వైజర్ కె శివ లను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ బి కళావతి భాయ్ అభినందిస్తూ సన్మానించారు క్షయ వ్యాధి నివారణలో దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరు ఉందంటూ క్షయ రహిత సమాజానికి వీరి కృషి ఎంతగానో ఉందంటూ ఈ సందర్భంగా తెలియజేశారు రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందించి క్షయ రహిత జిల్లాగా మార్చాలని కోరారు

ఈ కార్యక్రమంలో మధిర సివిల్ హాస్పిటల్ డాక్టర్ కే అనిల్ కుమార్ మరియు డాక్టర్ పృథ్వి, డాక్టర్ మనోహర్, టీబి నోడల్ ఆఫీసర్ ఇ విజయ్ కుమార్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు,హెచ్ ఎస్ కొండయ్య, హెచ్ ఏ శ్రీనివాస్, ఎల్ డి సి గౌతమ్, సిబ్బంది సంధ్యా అనురాధ తదితరులు పాల్గొన్నారు

కరాటే బెల్టుల ప్రధానోత్సవం

విశాలాంధ్ర-ములుగుజిల్లా బ్యూరో : మంగపేట మండలంలోని కమలాపురం జడ్పి హెచ్ఎస్ పాఠశాలల్లో గురువారం కరాటే మాస్టర్ అబ్బు ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించి,ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు లీసా లక్ష్మి ప్రసన్న పావని పద్మిని ప్రియా తహసీన్ సుల్తాన్ లకు ఆరెంజ్ బెల్టులు, మరో 10 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్ లు ప్రదానం చేయడం జరిగిందని పాఠశాల హెచ్ యం ఈ గడ్డి శ్రీనివాస్ తెలిపారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా ప్రాక్టీస్ చేసి బ్లాక్ బెల్ట్ సాదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కరాటే మాస్టర్ అబ్బు మాస్టర్, నజీర్ హుసేన్ మాస్టర్, ఉపాధ్యాయులు ప్రసాద్, సునీత,లావణ్య,రమేష్, నాగలక్ష్మి, బులక్ష్మి,మౌలాలి నర్సింహా రావ్,నరేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఎంట్రప్రెన్యూర్‌షిప్ విద్యను సరికొత్త విధానంలో రూపొందిస్తున్న బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఏప్రిల్ 12న టీ-హబ్‌లో నిర్వహించిన బోవర్ యూజీ సమ్మిట్‌లో తన అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2025 విద్యా సంవత్సరం నుండి ఈ కార్యక్రమం అమలులోకి వస్తుంది. ఇందుకోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మూడు సంవత్సరాల వ్యవధితో రూపొందిన

ఈ కార్యక్రమం భవిష్యత్ ఎంట్రప్రెన్యూర్‌లను తీర్చిదిద్దడానికి ఉద్దేశించింది. ఆచరణాత్మక అభ్యాసం, స్టార్టప్ వ్యవస్థాపకుల నేతృత్వంలో బోధన, వెంచర్ ప్రాజెక్టులు, అంతర్జాతీయ విజ్ఞాన ఆధారిత పాఠ్యాంశాలను ఇందులో చేర్చారు. ఆసక్తి గల విద్యార్థులు బోవర్ అధికారిక వెబ్‌సైట్ లోకి వెళ్లి బోవర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (%దీజూాా%) ద్వారా దరఖాస్తు చేయవచ్చు. బోవర్ స్కూల్ స్థాపకుడు పవన్ అల్లెన మాట్లాడుతూ.. "ఉద్యోగాల కోసం వెతికే వారిని తయారు చేయడం మా లక్ష్యం కాదు. ఉద్యోగాలను సృష్టించి, సవాళ్లను పరిష్కరించే, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడమే మా ధ్యేయం. అండర్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం ఆ లక్ష్యాన్ని సాధించే దిశలో తొలి అడుగు" అని స్పష్టం చేశారు.

మతాల మధ్య చిచ్చు

- మోదీ పాలనలో ప్రజలకు చేసింది శూన్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-మంగళగిరి: మోదీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చినకాకానిలో జరిగిన జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా గురువారం ఇక్కడ భారీ బహిరంగ సభ జరిగింది. సభకు సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో రాజకీయ మంటలు చెలరేగుతున్నాయని అన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని నిరసిస్తూ... మైనార్టీలు, వారి తరఫున దేశంలోని రాజకీయ పార్టీలన్నీ రోడ్డెక్కాయన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం చెల్లుబాటును సుప్రీంకోర్టులో సవాల్ చేశారని చెప్పారు. వక్ఫ్‌బోర్డులో ఇతర మతస్తులకు అవకాశం ఇస్తే...హిందూ ఆలయాల నిర్వహణలో ఇతర మతస్తులను అనుమతిస్తారా? అని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించిందన్నారు. వందల సంవత్సరాల నాటి డాక్యుమెంట్స్ అడిగితే... ఎలా తెస్తారని ప్రశ్నించిందన్నారు. మూర్ఖంగా, మొండిగా మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేయడానికి పూనుకున్నారని మండిపడ్డారు. సినీనటి రోజా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో రాజకీయాలు అధ్వానంగా తయారయ్యాయన్నారు. తిరుపతిలో లడ్డు కల్తీ ఘటనపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, ఆవులు చనిపోయాయని మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి చెప్పారని... దీనిపై విచారించి...ఏం జరిగిందో తేల్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే లందరూ కలిసి తిరుపతిలో ధర్నా చేయవలసిన అవసరం ఏముందన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు చిన్న చిన్న అంశాలపై రాజకీయ యుద్ధానికి దిగడం సరికాదన్నారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాషాయం ధరించి పాదయాత్ర చేస్తానంటూ... రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఉన్న హిందువుల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ ఏలు బడిలో రూపాయి విలువ దారుణంగా పడిపోయిందన్నారు. 2014లో డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.56 ఉంటే ఇప్పుడు రూ.86 ఉందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినా... ప్రధాని నరేంద్ర మోదీ కనీసం పరామర్శించడానికి కూడా వెళ్లలేదని విమర్శించారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అమరజీవి చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో జన సేవాదళ్ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ పరివార్, బజరంగ్‌దళ్ దేశంలో మత ఉన్మాదానికి తెగబడుతున్నాయని మండిపడ్డారు. బహిరంగ సభలో ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలతో అలరించారు. ఈ బహిరంగ సభలో జనసేవా దళ్ రాష్ట్ర ఇన్‌స్ట్రక్టర్ నార్ల వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు, ప్రజానాట్యమండలి నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, సీపీఐ చిన్న కాకాని మాజీ సర్పంచ్ బొర్రా మల్లికార్జున రావు, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేంద్ర , చిన కాకాని మాజీ సర్పంచ్ కుక్క మాల నాగేశ్వరరావు, జనసేవా దళ్ రాష్ట్రస్థాయి ఇన్‌స్ట్రక్టర్లు నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, సింగరాయకొండ, మురళి హేమ శంకర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు

విశాలాంధ్ర-మంగళగిరి: జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులలో శిక్షణ తీసుకున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు కదం తొక్కారు. ముందుగా సీపీఐ మంగళరిగి ఏరియా కార్యదర్శి యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జంగాల అజయ్ కుమార్ పుష్పాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య ఉన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకానిలో గత వారం రోజులుగా రాష్ట్రస్థాయి జనసేవాదళ్ శిక్షణా శిబిరం జరిగింది. చివరి రోజు గురువారం శిక్షణ తీసుకున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు చినకాకానిలోని సీపీఐ కార్యాలయం నుంచి గ్రామ పురవీధుల్లో కవాతుతో కదం తొక్కారు. జనసేవా దళ్ శిక్షణ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లుగా నార్ల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, హేమశంకర్, మురళి వ్యవహించారు. వలంటీర్ల కవాతు గ్రామవీధుల మీదుగా బహిరంగ సభ వేదిక వరకు సాగింది.

స్టీమ్‌కోల్ దిగుమతిలో జంట రికార్డులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పోర్టు అథారిటీలో అంతర్భాగంగా ఉన్న విశాఖ జనరల్ కార్గో బెర్త్... స్టీమ్ కోల్ నిర్వహణలో జంట రికార్డులు నెలకొల్పింది. 24 గంటల్లో రికార్డ్ స్థాయిలో స్టీమ్ కోల్, 74,001 మెట్రిక్ టన్నుల రోజువారీ దిగుమతి రేటును నమోదు చేయడం... రెండు అంశాలలో సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. ఎంవీ గినా ఓల్డెన్ డ్రాఫ్ అనే కేప్-సైజ్ నౌక నుంచి మొదటి 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,06,190 మెట్రిక్ టన్నుల స్టీమ్ కోల్ దిగుమతి చేశారు. మొత్తం 1,64,960 మెట్రిక్ టన్నుల స్టీమ్ కోల్‌ను కేవలం 53.5 గంటల్లో దిగుమతి చేయడం ద్వారా, వీజీసీబీలో 74,001 మెట్రిక్ టన్నుల రోజువారీ నిర్వహణ రేటును నమోదు చేసింది. ఈ అద్భుత విజయాన్ని ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి 16వ తేదీ రాత్రి తొమ్మిది గంటల మధ్య సాధించారు. ఎమ్మెస్ భూషణ్ వారు స్టీమ్‌కోల్ దిగుమతి చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ట్రాఫిక్ మేనేజర్ ... అతడి బృందాన్ని ప్రశంసించారు. వీజీసీబీ అత్యుత్తమ ప్రదర్శన , సమర్థవంతమైన కార్గో నిర్వహణపై అభినందనలు తెలిపారు. పోర్టు కార్యదర్శి టి. వేణుగోపాల్ ఈ వివరాలను మీడియాకు విడుదల చేశారు.

యూరప్‌కు సీఎం... అక్కడే 75వ పుట్టినరోజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 20న 75వ పడిలోకి అడుగ ుపెట్టబోతున్నారు. తన పుట్టినరోజు వేడుకలను కుటుంబ సమేతంగా యూరప్‌లో సీఎం జరుపుకుంటారు. ఇందుకోసం ఆయన గురువారం యూరప్‌కు ఢిల్లీ నుంచి పయనమయ్యారు. చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ దంపతులున్నారు. వీరంతా ఈనెల 21న రాష్ట్రానికి తిరిగి వస్తారు.

పొన్ముడిపై కేసు పెట్టలేదో: మద్రాస్ హైకోర్టు

చెన్నై: తమిళనాడు మంత్రి పొన్ముడి వివాదాస్పద వ్యాఖ్యలపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆయనపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. లేనిపక్షంలో కోర్టు ధిక్కార చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. 'ఈ వ్యవహారాన్ని కోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ఫిర్యాదు లేకపోయినా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయండి' అని జస్టిస్ ఎస్.ఆనంద్ వెంకటేశ్ అన్నారు. కేసు విచారణను ఏప్రిల్ 23కి వాయిదా వేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పొన్ముడి మాట్లాడుతూ సెక్స్ వర్కర్, కస్టమర్ మధ్య సంభాషణ అంటూ.. అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించారు. సంబంధిత వీడియో వైరలైంది. మంత్రి తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. డీఎంకే ఎంపీ కనిమొళి, గాయని చిన్మయి, నటి ఖుష్బూతో పాటు చాలా మంది ప్రముఖులు ఖండించారు. దీంతో పొన్ముడిని ఆయన్ను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తొలగించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జై కిషన్ మృతి

ఖర్గే సహా పార్టీ నేతల నివాళి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఐదుసార్లు ఎమ్మెల్యే జై కిషన్ (66) మృతి చెందారు. గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. సుల్తాన్‌పుర్ మజ్రాలోని తన నివాసంలో కిషన్ రెడ్డి మరణించారు. ఆయన మృతికి కాంగ్రెస్ పార్టీ నేతలు సంతాపం ప్రకటించారు. జై కిషన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జై కిషన్ మరణం పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. నిబద్ధతగల నాయకుడని, వెనుకబడిన వర్గాల సాధికారత కోసం గణనీయంగా తోడ్పాటు అందించారని శ్లాఘించారు. ఆయన కుటుంబానికి, బంధు మిత్రులు, మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సంతాపం ప్రకటిస్తూ పార్టీ కోసం జైకిషన్ నిర్విరామంగా పనిచేశారని కొనియాడారు. కింది స్థాయి నుంచి పైకొచ్చారని, దళిత అగ్రనేతగా ఎదిగారన్నారు. ప్రజా సేవకు అంకితమయ్యారని, అనేక జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. జై కిషన్ లేని లోటు పార్టీకి తీరనిదని వేణుగోపాల్ పేర్కొన్నారు. జై కిషన్ ఉత్తమ దళిత నేగా గుర్తింపు తెచ్చుకున్నారు. సుల్తాన్‌పుర్ మజ్రా నియోజకవర్గం నుంచి ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఏఐసీసీ కార్యదర్శిగా, ఢిల్లీ శాఖ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీలో అనేక పదువులు చేపట్టారు.

ప్రజా గొంతుక విశాలాంధ్ర: అజయ్‌బాబు

కొత్తగా 100 సంవత్సర చందాలు

విశాలాంధ్ర - హైదరాబాద్: విశాలాంధ్ర దినపత్రికను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్ బాబు పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఇంచార్జ్ బాలరాజు అధ్యక్షతన గురువారం జరిగిన హైదరాబాద్ ఎడిషన్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అజయ్ బాబు మాట్లాడుతూ గడిచిన 73 సంవత్సరాలుగా అవిశ్రాంతంగా సామాజిక బాధ్యతతో విశాలాంధ్ర దినపత్రిక ఎలాంటి లాభాపేక్ష లేకుండా నడుస్తోందన్నారు. కేవలం కార్మికుల హక్కుల సాధన, కర్షకుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో అనేక విజయాలు సాధించిందన్నారు. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను లేవనెత్తి ప్రజా గొంతుకగా మారిందన్నారు. రాష్ట్ర విభజన తరువాత రెండు రాష్ట్రాల్లో పత్రికకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా 100 కాపీలకు సంవత్సర చందాలను కట్టారు. తొలుత ఇటీవల మరణించిన తుర్కయాంజల్ విశాలాంధ్ర విలేకరి శ్రీనివాస్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎడిషన్ ఇంచార్జ్ రామారావు, మేనేజర్ సాయిబాబా, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా విలేకరులు హాజరయ్యారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో 534 పోస్టుల భర్తీ

కేంద్రం ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి కేంద్రం చర్యలు చేపట్టింది. 534 పోస్టులు భర్తీకి ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వినతులకు స్పందించిన ఆర్థిక శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పోస్టుల భర్తీకి సహకరించిన నిర్మలా సీతారామన్, జేపీ నడ్డాకు మంత్రి పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.

'కూటమి' అవినీతితోనే పరిశ్రమలు దూరం: బొత్స

విశాలాంధ్ర-విశాఖపట్నం: అధికార కూటమి భాగస్వామ్య పార్టీల అవినీతితో పారిశ్రామికవేత్తలకు వేధింపులు తప్పడం లేదని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కూటమి నేతల అరాచకాలతో పరిశ్రమల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జిందాల్ వంటి దిగ్గజాలను సాగనంపారని, కడప జిల్లాలోని సిమెంట్ పరిశ్రమలను మూయించాలని చూస్తున్నారని విమర్శించారు. బొత్స సత్యనారాయణ గురువారం మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్ కుమార్‌తో కలిసి విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, కూటమి నేతలపై మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయని, పెద్ద ఎత్తున పెట్టబడులు వస్తున్నాయని, వేల కోట్లుతో కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని సీఎం గొప్పలు చెప్పుకుంటారు కానీ, ఉన్న పరిశ్రమలనే మామూళ్లు, కాంట్రాక్ట్‌ల కోసం బెదిరించి.. రాష్ట్రం నుంచి వెళ్లిపోయేలా కూటమి నాయకులు చేస్తున్నారని బొత్స ఆగ్రహం వ్యక్తంచేశారు. 'విద్యుత్ కర్మాగారం వద్ద ఫ్లైయాష్ కోసం చేసిన గొడవ గురించి అందరికీ తెలుసు. కృష్ణపట్నంలో పవర్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్‌పై దౌర్జన్యం... ఎచ్చెర్ల మద్యం ఫ్యాక్టరీని మామూళ్ల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు బెదిరించడం తెలుసు' అని అన్నారు. కూటమి నేతల మామూళ్ల బెదిరింపులతో జిందాల్ వంటి దిగ్గజ సంస్థ మన రాష్ట్రానికి రాకుండా మహారాష్ట్రకు వెళ్లిపోయిందన్నారు. ఇంత జరుగుతున్నా చట్టపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పాలక పక్షాన్ని దుయ్యబట్టారు. పరిశ్రమలకు అనువైన వాతావరణం ఎలా సృష్టిస్తారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రభుత్వ అలసత్వం, దుర్మార్గ ఆలోచనలతో రాబోయే తరాలకు ఇబ్బందులు తప్పవని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు.

విశాఖ మేయర్‌పై పాదర్శకంగా అవిశ్వాస తీర్మానం

విశాఖ మేయర్‌పై అవిశ్వాస ఓటింగ్ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగాలని కలెక్టర్‌ను వైసీపీ కోరింది. ఇప్పటికే తమ కార్పొరేటర్లకు విప్ జారీ చేసింది. విప్ ధిక్కరిస్తే చర్యలు తప్పబోవని హెచ్చరించింది. తమకు కౌన్సిల్‌లో బలం ఉందని, ఓటింగ్‌లో పాల్గొనబోమని, మేయర్ నాలుగేళ్లు నిజాయితీగా పనిచేశారని పేర్కొంది. టీడీపీ కుట్రపూరితంగా మేయర్ పదవిని దక్కించుకోవాలనే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించింది.

పరిస్థితి అదుపులోనే ఉంది

ముర్షిదాబాద్ హింసపై బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా: ముర్షిదాబాద్ హింసాకాండపై బెంగాల్ ప్రభుత్వం కోల్‌కతా హైకోర్టుకు గురువారం నివేదిక సమర్పించింది. ముర్షిదాబాద్ జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని పేర్కొంది. మత ఘర్షణలు చెలరేగిన ముర్షిదాబాద్ జిల్లాలో బాంబు పేలుళ్లు జరిగాయని, ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించాలంటూ బీజేపీ నేత సువేందు అధికారి కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సౌమన్ సేన్, జస్టిస్ రాజాబసు చౌదరితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆ జిల్లాలో అధికార యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారని ఆ నివేదిక పేర్కొంది. బాధిత కుటుంబాలు ఇప్పటికే వారి నివాసాలకు చేరుకున్నారని తెలిపింది. ముర్షిదాబాద్‌లో క్షేత్రస్థాయి పరిస్థితుల సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని... కేంద్రబలగాల మోహరింపును మరికొంత కాలం పొడిగించాలని కేంద్రం తరపున హాజరైన న్యాయవాది కోర్టును కోరారు. ముర్షిదాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో 17 కంపెనీల బలగాలను కేంద్రం మోహరించింది.

చోక్సీ అప్పగింతపై బెల్జియంతో భారత్ చర్చలు

న్యూఢిల్లీ: ఆర్థిక నేరస్తుడు మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణదీర్ జైశ్వాల్ గురువారం తెలిపారు. 'భారత ప్రభుత్వ అధికారిక విజ్ఞప్తి మేరకు చోక్సీని బెల్జియం, ఆట్వెప్‌లో శనివారం అరెస్టు చేశారు. అతనిని భారత్‌కు అప్పగించడంపై చర్చలు జరుగుతున్నాయి' అని జైశ్వాల్ చెప్పారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చోక్సీ నిర్బంధంలో ఉన్నట్లు బెల్జియం ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ ఆఫ్ జస్టిస్ ధ్రువీకరించిందని చెప్పారు. కాగా, చోక్సీని తమకు అప్పగించాలని భారత్ కోరినట్లు బెల్జియం అధికారులు వెల్లడించారు. చోక్సీ 2018, జనవరి 2న విదేశాలకు తప్పించుకుపోగా, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13,850 కోట్ల కుంభకోణానికి సంబంధించిన ఆర్థిక నేరస్తుడిగా అతను ఉన్నాడు. చోక్సీ అరెస్టు తర్వాత అతని తరపు న్యాయవాది విజయ్ అగర్వాల్ స్పందించారు. చోక్సీని భారత్‌కు అప్పగిస్తే ఆయన మానవ హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు.

ఫడ్నవీస్‌కు బాంబే హైకోర్టు సమన్లు

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు బాంబే హైకోర్టు గురువారం సమన్లు జారీ చేసింది. 2024 ఎన్నికల ఫలితాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత ప్రఫుల్ వినోద్‌రావ్ గుడాడే కోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ స్పందన కోరింది. వాస్తవానికి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫడ్నవీస్ చేతిలో వినోద్‌రావు 39,710 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నేత ఆరోపించారు. ఫడ్నవీస్ ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోర్టును కోరారు. దీంతో మే 8లోగా ఫడ్నవీస్ స్పందించాలంటూ జస్టిస్ ప్రవీణ్ పాటిల్ ధర్మాసనం సమన్లు జారీచేసింది.

పలస్తీనా పిల్లాడి చిత్రానికి 'వరల్డ్ ప్రెస్ ఫోటో' అవార్డు

న్యూయార్క్: వరల్డ్ ప్రెస్ ఫోటో ఈ సంవత్సరం ఉత్తమ ఫోటోను విడుదల చేసింది. గాజాలో గాయపడ్డ చిన్నారి ఫోటోను తీసిన మహిళా ఫోటోగ్రాఫర్‌కు అవార్డు ఇచ్చింది. రెండు చేతులు కోల్పోయి దీనంగా చూస్తున్న తొమ్మిదేళ్ల పలస్తీనా అబ్బాయిని మహిళా ఫోటోగ్రాఫర్ తన కెమెరాలో బంధించారు. గాజాలో మారణహోమానికి నిదర్శనంగా నిలిచిన ఫోటో 2025 వరల్డ్ ప్రెస్ ఫోటో ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైంది. న్యూయార్క్ టైమ్స్ ఫోటో జర్నలిస్టు సమర్ అబూ ఈ ఫొటో తీశారు. మహమూద్ అజ్వౌర్ తన రెండు చేతులను ఇజ్రాయిల్ దాడుల్లో కోల్పోయాడు. ప్రస్తుతం దోహ, ఖతార్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రెస్ ఫోటో అవార్డు కోసం 59,320 దరఖాస్తులు వచ్చాయి. సుమారు 3778 మంది జర్నలిస్టులు వీటిని సబ్మిట్ చేశారు. పలస్తీనా కుర్రాడి పోర్ట్రేయిట్ ఫోటోను వరల్డ్ ప్రెస్ ఫోటో ఢఫ్ ది ఇయర్‌గా ప్రకటించారు.

మహారాష్ట్రలో హిందీ వద్దు: రాజ్ ఠాక్రే

ముంబై: హిందీ భాషా వివాదం మహారాష్ట్రకు చేరింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరిగా మూడవ భాషగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే వ్యతిరేకించారు. 'మేం హిందువులం. హిందీ కాదు' అని అన్నారు. మహారాష్ట్రకు 'హిందీ' రంగు పులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా పోరాడటం ఖాయమన్నారు. మరాఠీ, మరాఠీయేతరుల మధ్య వివాదాలు సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలు చేపడుతోందని విమర్శించారు. హిందీ జాతీయ భాష కాదని. మహారాష్ట్ర విద్యార్థులకు ప్రాథమిక స్కూళ్లలో హిందీని ఎందుకు బోధించాలి రాజ్ ఠాక్రే నిలదీశారు.

1000 కిలోల బంగారం కరిగించాం: తమిళనాడు

చెన్నై: తమిళనాడులోని 21 ఆలయాలకు భక్తులు సమర్పించిన... నిరుపయోగంగా ఉన్న 1,000 కిలోలకు పైగా బంగారు వస్తువులను కరిగించినట్లు స్టాలిన్ ప్రభుత్వం వెల్లడించింది. వాటిని 24 క్యారెట్ల కడ్డీలుగా మార్చి బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపింది. తద్వారా ఏటా రూ.17.81 కోట్లు వడ్డీ రూపంలో ఆదాయం వస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. పెట్టుబడి ద్వారా వచ్చే వడ్డీని సంబంధిత ఆలయాల అభివృద్ధికే వినియోగిస్తామని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. హిందూ మత, దేవాదాయ శాఖకు సంబంధించిన ఓ విధానపర పత్రాన్ని మంత్రి శేఖర్ బాబు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ పథకం అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు ఒకరు చొప్పున ముగ్గురు రిటైర్డ్ న్యాయమూర్తులతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. తిరుచిరాపల్లి జిల్లాలోని మరియమ్మన్ ఆలయం నుంచి గరిష్ఠంగా 424 కేజీల బంగారం వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

కే2-18బీ గ్రహంపై జీవం!

ఆనవాళ్లు గుర్తించిన భారత సంతతి శాస్త్రవేత్త బృందం

న్యూఢిల్లీ: జీవానికి మూలమైన కణజాలం కే2-18బీ గ్రహంపై ఉన్నట్లు ఖగోళ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్ కనుగొన్నారు. ఆయన అధ్వర్యంలో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల శోధనతో జీవం ఆనవాళ్లు లభించాయి. సౌర కుటుంబానికి ఆవల ఉన్న కే2-18బీ గ్రహంపై భూమి మీద చిన్న చిన్న జీవాలు ఉత్పత్తి చేసే కణాలకు చెందిన సిగ్నల్స్‌ను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో తమ అధ్యయన వివరాలను ప్రచురించారు. కే2-18బీపై వాతావరణంలో జీవ సంబంధిత రసాయనాలను రెండవసారి గుర్తించినట్లుగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా జీవానికి సంబంధమైన డైమిథైల్ సల్ఫైడ్ (డీఎంఎస్), డైమిథైల్ డైసల్ఫైడ్ (డీఎండీఎస్) గుర్తించినట్లు తెలిపారు. ఈ రసాయనాలపై అధ్యయనానికి తమకు మరింత డేటా కావాలన్నారు. మరింత ఆసక్తికరమైన సమాచారం త్వరలో లభిస్తుందని పరిశోధకుడు మధుసూదన్ తెలిపారు. ఆ గ్రహంపై జీవం ఉన్నట్లు బలమైన ఆధారం దొరికిందన్నారు. ఇందుకు సంబంధించిన సిగ్నల్‌ను ధ్రువీకరించేందుకు మరో రెండేళ్లు పట్టవచ్చని ఆయన తెలిపారు. 'కే2-18బీ గ్రహం భూమి కంటే రెండున్నర రెట్ల పెద్దది. భూమికి 700 ట్రిలియన్ల మైళ్లు అంటే దాదాపు 124 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. మానవుడు తన జీవిత కాలంలో అంత దూరం ప్రయాణించలేడు' అని శాస్త్రవేత్తలు వెల్లడించారు. డైమిథైల్ సల్ఫైడ్(డీఎంఎస్), డైమిథైల్ డైసల్ఫైడ్(డీఎండీఎస్)ను సముద్ర మొక్కలు, బ్యాక్టీరియా విడుదల చేస్తాయన్నారు. కే2-18బీ గ్రహంపై ఆ వాయువులు భారీ స్థాయిలో ఉన్నాయని, భూమీద ఉన్న దానికి వెయ్యి రెట్లు ఎక్కువగా అక్కడ ఉన్నాయని మధుసూదన్ వెల్లడించారు. కే2-18బీ గ్రహంపై సముద్రం ఉన్నట్లు పరిశోధన భాగస్వామి, కార్డిఫ్ యూనివర్సిటీ ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ సుబీర్ సర్కార్ తెలిపారు. తమ పరిశోధనల్లో ఈ విషయం తెలిసిందని, అందుకే అక్కడ జీవం ఉందని భావిస్తున్నామని అన్నారు. కాగా, జీవానికి అనువైన వాయువులు ఎలా పుడుతున్నాయో తెలుసుకోవాల్సి ఉంటుందని పరిశోధకుల్లో ఒకరైన ఎడిన్‌బర్గ్ వర్సిటీ ప్రొఫెసర్ క్యాథరిన్ హేమాన్స్ వెల్లడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.